దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ


SINCE: 1984
చైతన్య కాలేజ్
Cell: 93908 22625
ONE SITTING (For Discontinued)
B.Tech, M.Tech, Diploma
M.B.A, M.C.A, M.Sc, M.A.
B.A, B.Com, B.Sc, B.B.A,
U.G.C. Recog. Universities
10th & Inter TOSS / APOSS / NIOS
డైరెక్టర్: బి.వి. త్రినాథ్ M.A, M.Ed, M.Phil, L.L.B


| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 79 | ది. 26-6-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 79 | Date : 26-6-2026 | Friday | Pages : 8 | Rs.1/- |


# గంగా-కావేరి అనుసంధానంతో భారత్ అన్ స్టాపబుల్

- తుంగభద్ర గేట్ల పునరుద్ధరణతో రైతుల ప్రయోజనాలు కాపాడాం
- ఏపీ,కర్ణాటక, తెలంగాణ సీఎంల సమావేశం ఓ చారిత్రాత్మకం
- కర్ణాటకలోని హోసపేట బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక, తెలంగాణ సీఎంలతో కలిసి క్రస్ట్ గేట్లు ప్రారంభించిన సీఎం





**హోసపేట, జూన్ 25 (వార్తాప్రభ) :** కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి తుంగభద్ర ప్రాంత రైతుల ప్రయోజనాలపై చర్చించడం చారిత్రాత్మక ఘట్టమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాలు వేరైనా దేశంగా మనమంతా ఒక్కటేనని, రైతుల సంక్షేమం కోసం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మూడు రాష్ట్రాల రైతులకు సాగునీటిని, ప్రజలకు తాగు నీటిని అందిస్తున్న తుంగభద్ర డ్యామ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని సీఎం చెప్పారు. 2024 ఆగస్టులో తుంగభద్ర ప్రాజెక్టులో 19వ నెంబరు గేటు కొట్టుకుపోవటంతో తక్షణం స్పందించి స్టాప్ లాక్ గేట్ అమర్చామని అన్నారు. ప్రాజెక్టు మరమ్మతులో భాగంగా రూ.51 కోట్ల వ్యయంతో మొత్తం 33 కొత్త గేట్లను ఏపీ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా వీటిని ఏర్పాటు చేశామన్నారు. ఈ గేట్ల ప్రారంభోత్సవంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ పాల్గొన్నారు. తుంగ భద్ర డ్యామ్ లోని సీఎం చంద్రబాబు 19వ నెంబరు గేటు, కర్ణాటక ముఖ్యమంత్రి 18వ గేటును, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ 17వ గేటును, అలాగే 20 గేటును తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ముందు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తుంగభద్ర ప్రాజెక్టు, జలాల వినియోగంపై సమావేశమయ్యారు. మూడు రాష్ట్రాల ప్రయోజనాలపై నలుగురు నేతలు విస్తృతంగా చర్చించారు.

**దేశ భవిష్యత్‌కు నదుల అనుసంధానం అవసరం..** 2024లో 19వ గేట్ కొట్టుకుపోయినప్పుడు స్టాప్ లాక్ గేట్ ఏర్పాటు చేసి నీటి వృధాను అరికట్టామని, ప్రస్తుతం 33 క్రస్ట్ గేట్లను పునరుద్ధరించి ప్రాజెక్టును మరింత బలోపేతం చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేశాయని వెల్లడించారు. 'తుంగభద్ర నది చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను గుర్తుచేశారు. విజయనగర సామ్రాజ్యానికి, హంపీకి తుంగభద్ర నది సహజ రక్షణ కవచంగా నిలిచిందన్నారు. జోగులాంబ ఆలయం, హంపీ విరూపాక్ష ఆలయం, మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం వంటి పుణ్యక్షేత్రాలు ఈ నదీ తీరానే వెలిశాయని సీఎం పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు కోసం నదుల అనుసంధానం అత్యంత అవసరమని సీఎం అభిప్రాయపడ్డారు. కెన్--బేత్వా ప్రాజెక్టు ద్వారా ఉత్తర భారతదేశంలో నదుల అనుసంధానం విజయవంతంగా అమలవుతోందని, అదే తరహాలో గోదావరి--కావేరి అనుసంధానం జరిగితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరతాయని సీఎం చంద్రబాబు అన్నారు. 1983లో ప్రధానితో పాటు నలుగురు ముఖ్యమంత్రులు కలిసి తమిళనాడుకు 5 టీఎంసీల నీళ్లు ఇవ్వాలని నిర్ణయించారని, ఉమ్మడి ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర అంగీకారంతో చెన్నైకి 15 టీఎంసీల తాగు నీటిని అందించామని గుర్తు చేశారు. గంగా- కావేరీ నదుల అనుసంధానం జరిగితే భారత్ అభివృద్ధి అన్ స్టాపబుల్ అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**నీటి వనరుల్ని పొదుపుగా వినియోగించాలి..** ఎల్‌నినో ప్రభావంతో జలాశయాలకు నీటి ప్రవాహాలు తగ్గుతున్న నేపథ్యంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా రాష్ట్రాలు అంతర్గతంగా నదుల అనుసంధానం చేపట్టి, ఆ తర్వాత రాష్ట్రాల మధ్య అనుసంధానానికి అడుగులు వేయాలని సూచించారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణే అన్ని ప్రభుత్వాల ఉమ్మడి లక్ష్యమని స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య జరిగిన ఈ సమావేశం చరిత్రలో నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు. అంతా కలిసి రైతుల ప్రయోజనాలను కాపాడుకుందామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఆధునిక దేవాలయాలైన ప్రాజెక్టులను పరిరక్షించుకుంటే దేశాభివృద్ధికి అవి కీలకం అవుతాయని అన్నారు. ఈ సమావేశానికి ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, తెలంగాణా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి సహా మూడు రాష్ట్రాల స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

## ప్రైవేట్ నుండి ప్రభుత్వ పాఠశాలల్లో లక్షకు పైగా విద్యార్థుల చేరిక

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, అభ్యసన ఫలితాలపై దృష్టి సారించాలి
- ప్రాథమికోన్నత పాఠశాలల్లో గరిష్ట సామర్థ్యానికి విద్యార్థుల ప్రవేశాలు
- ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణపై అధ్యయనం చేయండి
- సెప్టెంబర్ 5 నుంచి 9,10 తరగతి విద్యార్థులకు ఏఐ ట్యూటర్ విధానం
- పాఠశాల విద్యపై సమీక్షలో మంత్రి నారా లోకేష్



**ఉండవల్లి,జూన్ 25 (వార్తాప్రభ) :** ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది విద్యార్థుల హాజరు, అభ్యసన ఫలితాలపై దృష్టిసారించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్యపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రైవేటు స్కూళ్లనుంచి... ప్రభుత్వ పాఠశాలలకు ఈ ఏడాది 1,06,000 వేల మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. ముఖ్యంగా ప్రాథమికోన్నత పాఠశాలలు 7,620 ఉండగా.. 3,515(46.13%) పాఠశాలల్లో గరిష్ట సామర్థ్యం మేర విద్యార్థుల ప్రవేశాలు పొందారని చెప్పారు. విద్యారంగంలో సంస్కరణల ఫలితంగానే విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయన్నారు. ఈ ఏడాది 159 పాఠశాలలు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా రూపాంతరం చెందాయని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణపైనా సమావేశంలో చర్చించారు. అధిక ఫీజుల నియంత్రణకు ఇతర రాష్ట్రాలు అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 5 నుంచి ఫేజ్-1 కింద 175 లీప్ పాఠశాలల్లో 9,10 తరగతుల విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి ఏఐ ట్యూటర్ విధానాన్ని ప్రి పైలట్ ప్రాజెక్ట్ గా చేపట్టనున్నట్లు అధికారులు వివరించారు. భవిష్యత్ లో క్లిక్కర్స్ కు ఏఐ ట్యూటర్ ను అనుసంధానించాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ఐఈఆర్ పీఎస్ రెగ్యులరైజేషన్, హై స్కూల్ ప్లస్ లలో గెస్ట్ లెక్చరర్ల రిక్రూట్ మెంట్ అంశంపైనా సమావేశంలో చర్చించారు.

**త్వరలో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన..** అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీతో పాటు విశాఖలో డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీ, మంగళగిరిలో స్కిల్ ఎక్స్ లెన్స్ సెంటర్ ఏర్పాటుపైనా సమావేశంలో చర్చించారు. ఇందుకు సంబంధించిన భవన నమూనాలను మంత్రి పరిశీలించి పలు సూచనలు చేశారు. వచ్చే నెలలో అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీకి శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి (ఇన్ ఛార్జి) శ్యామలరావు, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా, విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండి దీవెన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు 'ప్రజా ప్రభుత్వం' బంపర్ ఆఫర్


- ఒక్క రూపాయి భారం లేకుండా రూ కోటి 25 లక్షల ఉచిత ప్రమాద బీమా
- విమాన ప్రమాదమైతే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు రక్షణ
- కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికీ వర్తింపు
- దేశ చరిత్రలోనే తొలిసారి
- ఒకటో తేదీనే జీతాలు..
- త్వరలోనే 'క్యాష్‌లెస్' హెల్త్ కార్డ్స్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,జూన్ 25 (వార్తాప్రభ) :** తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో భద్రత, భరోసా కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ ఉద్యోగుల సంక్షేమం కోసం దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా సరికొత్త ఉచిత బీమా పథకాన్ని ఆమోదించిందని ఆయన వెల్లడించారు. ఈ పథకం ద్వారా అటు ప్రభుత్వంపై కానీ, ఇటు ఉద్యోగులపై కానీ ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడకుండా, బ్యాంకులతో మాట్లాడి ఈ భారీ బీమా రక్షణను కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ అద్భుతమైన బీమా పథకం ద్వారా సాధారణ ప్రమాదాల్లో మరణిస్తే రూ. కోటి 25 లక్షలు, అదే విమాన ప్రమాదం జరిగితే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు బీమా పరిహారం అందుతుందని భట్టి విక్రమార్క వివరించారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఉద్యోగులకు రూ. 10 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ శాశ్వత సంపూర్ణ వైకల్యం లేదా పాక్షిక వైకల్యం సంభవించినా ఈ పథకం ద్వారా ఉద్యోగులకు ఆర్థిక అండ లభిస్తుందన్నారు. కేవలం రెగ్యులర్ ఉద్యోగులకే కాకుండా.. నెలనెలా ప్రభుత్వ రికార్డుల ద్వారా జీతం పొందే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. తమ కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా ఆపద వస్తే ఆ కుటుంబం రాత్రికి రాత్రే రోడ్డున పడే పరిస్థితి ఉండకూడదు. ఉద్యోగులు కేవలం జీతగాళ్లు కాదు, వారి కుటుంబాలకు ఈ ప్రభుత్వం ఒక పెద్ద దిక్కుగా ఉంటుందని నమ్మకం కలిగించడమే మా లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు 15 లేదా 20వ తేదీ వరకు రాకపోవడం వల్ల ఉద్యోగులు పడిన ఇబ్బందులను భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ప్రస్తుత కాలంలో ఇళ్లు, వాహనాలు, పిల్లల చదువుల కోసం ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఇన్‌స్టాల్మెంట్స్ (ఈఎంఐలు) కడుతున్నారు. సకాలంలో జీతాలు రాకపోతే వారి అకౌంట్లు బ్యాడ్ అకౌంట్స్‌గా మారి సిబిల్ స్కోర్ దెబ్బతినేది. మా ప్రభుత్వం రాగానే ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉన్నప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి 'ఉద్యోగుల హక్కులను కాపాడాలి' అని గట్టిగా నిర్ణయించుకుని, ఒకటో తేదీ నాడే జీతాలు ఇచ్చేలా కఠినమైన ప్రణాళికను అమలు చేశారని అన్నారు. ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో కోరుతున్న హెల్త్ కార్డ్‌ల సమస్యకు ప్రజా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక ప్రత్యేక 'ట్రస్ట్' ద్వారా ఉద్యోగులందరికీ పూర్తి స్థాయిలో 'క్యాష్‌లెస్' (నగదు రహిత) వైద్య సేవలు అందించేలా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని, దీనివల్ల ఆరోగ్య భద్రత మరింత మెరుగవుతుందని భరోసా ఇచ్చారు.

## నవ్యాంధ్రలో సరికొత్త 'క్రియేటివ్ ఎకానమీ విప్లవం'..

- జూలైలో మెగా ఫిల్మ్ వర్క్‌షాప్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
- సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్ ను కలిసిన 'జాడెక్స్ ఇన్నోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్' ప్రతినిధులు




**అమరావతి,జూన్ 25 (వార్తాప్రభ) :** సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర రంగానికి సరికొత్త గ్లామర్, గ్లోబల్ టెక్నాలజీని అద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సరికొత్త 'క్రియేటివ్ ఎకానమీ'కి తెరలేపింది. ఏపీ యువతలోని సినిమా ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేస్తూ, ఫిల్మ్ డెవలప్‌మెంట్‌కు అత్యంత ప్రాధాన్యతనిచ్చేలా జూలైలో 'క్రియేటివ్ ఎకానమీ'పై ఒక వర్క్‌షాప్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్‌ను 'జాడెక్స్ ఇన్నోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్' ఫౌండర్ దివ్య కొనకళ్ల, కో-ఫౌండర్ శశికుమార్ పెయ్యాల మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ, ఫిల్మ్ మేకింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించాలన్న వారి వినూత్న ప్రతిపాదనకు మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. తద్వారా ఔత్సాహిక చిత్ర నిర్మాతలు, నూతన కళాకారులు, సాంకేతిక నిపుణులు, రచయితలు, డిజిటల్ కంటెంట్ క్రియేటర్లకు సినిమా నిర్మాణంలోని అత్యాధునిక సాంకేతికతలను పరిచయం చేయడం జరుగుతుందన్నారు. అంతేగాక పరిశ్రమ నిపుణుల పర్యవేక్షణలో వెండితెర అద్భుతాన్ని ఆవిష్కరించే 24 క్రాఫ్ట్ లో మెళకువలపై ఈ వర్క్‌షాప్‌లో ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. కథాభివృద్ధి, స్క్రీన్ ప్లే, ఏఐ సహాయక చిత్ర నిర్మాణం తదితర అంశాలపై పాల్గొనే వారికి లైవ్ ఎక్స్ పీరియన్స్ అందిస్తామన్నారు. "ఆంధ్రప్రదేశ్ యువతలో అద్భుతమైన సృజనాత్మకత ఉంది. వారికి సరైన వేదిక, ఆధునిక సాంకేతికత తోడైతే టాలీవుడ్‌లో సరికొత్త సంచలనాలు సృష్టిస్తారు. ఈ క్రియేటివ్ ఎకానమీ వర్క్‌షాప్ ద్వారా స్థానిక టాలెంట్‌కు పెద్దపీట వేసి, ఏపీని సినిమా హబ్‌గా మారుస్తాం." అని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ అన్నారు. జాడెక్స్ ఫౌండర్ దివ్య కొనకళ్ల మాట్లాడుతూ.. మంత్రి కందుల దుర్గేష్ విజనరీ ఆలోచనలకు తగ్గట్టుగా, ఈ వర్క్‌షాప్‌ను కేవలం థియరీ క్లాసుల్లా కాకుండా, ప్రతి ఒక్కరికీ ప్రాక్టికల్ అనుభూతిని ఇచ్చేలా అత్యంత ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.










## పెడన విఆర్ఓ ల సంఘం అధ్యక్షుడిగా గోపిశెట్టి మధు శేఖర్



**పెడన,జూన్ 25 (వార్తాప్రభ) :** పడమ మండల గ్రామ రెవెన్యూ అధికారుల (విఆర్ఓ ) సంఘం అధ్యక్షునిగా గోపిశెట్టి మధు శేఖర్ ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారంనాడు విఆర్ఓ ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శిగా ఎమ్ డి మౌలాలి ఉపాధ్యక్షునిగా మోర్ల శ్రీనివాస్ కోశాధికారిగా నిమ్మగడ్డ రాందాస్ లు ఎన్నికయ్యారు.

## పూర్వక ధ్వజస్తంభ ప్రతిష్ట పూజలు నిర్వహించిన అధికారులు



**విస్సన్నపేట,జూన్ 25 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని పుట్రేల మారెమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో పూర్వక ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి, ఎంపీడీవో చిన్న రాట్నాలకు, చైర్మన్ టి శ్రీనివాసరావు, ఆలయ ఈవో బి డి ప్రసాద్ లు సుగంధ పరిమళాలు వెదజల్లే పూలదండలతో పట్టు శాలువాలతో వేదమంత్రొచ్చరణాల మధ్య ఘనంగా సన్మానించారు.

## పూర్వక ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు



**విస్సన్నపేట,జూన్ 25 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలోని పుట్రేల మారెమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరిగిన పూర్వక ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో గ్రామ పెద్ద వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్ది రెడ్డి సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. పోటెత్తిన భక్త జన సమూహాన్ని చీల్చుకుంటూ వచ్చి ధ్వజస్తంభ పీఠంలో నవధాన్యాలు ముత్యం పగడం బంగారం వెండి కాసులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో డి దామోదరరెడ్డి, తాళ్ల రామ్మోహన రెడ్డి, అప్పి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక గ్రామానికి చెందిన గుడివాడ ఎమ్మార్వో బుగ్గ ప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## జలధార కార్యక్రమం



**తిరువూరు,జూన్ 25 (వార్తాప్రభ) :** తిరువూరు మండలం గానుగపాడు గ్రామంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆర్డిఓ మరియు తాహసిల్దారు పర్యటించి గ్రామంలో జరిగిన జలధర కార్యక్రమం భాగంగా వ్యవసాయానికి రైతులకు మీరు ఆటంకం లేకుండా అందించటానికి కాలువలలో ఉన్న పూడికను ఆర్డీవో కుమార్ స్వయంగా దగ్గరుండి పనులు పర్యవేక్షించి కాలువలో పేరుకుపోయిన చెత్తను పూడిక తీంచారు రైతులు వ్యవసాయానికి అందుబాటులో కాలువను తీసుకువచ్చారు కార్యక్రమంలో ఏపీవో మరియు ఉపాధి కార్మికులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మేకావారిపాలెం సొసైటీలో నూరుశాతం రుణాల వసూళ్లు..



**చల్లపల్లి/అవనిగడ్డ,జూన్ 25 (వార్తాప్రభ) :** రైతుల సహకారంతో చల్లపల్లి మండలం, మేకావారిపాలెం సొసైటీలో నూరు శాతం రుణాల వసూలు జరిగినట్లు సొసైటీ ఛైర్ పర్సన్ గుత్తికొండ వంశీకృష్ణ, సీఈవో కోరుకొండ శ్రీనివాసరావులు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సొసైటీలో 244 మంది రైతులకు రూ. 2.19కోట్ల40428 రుణాలు మంజూరు చేశామన్నారు. జూన్ నెలాఖరులోగా రుణాలు చెల్లించాల్సి ఉండగా, నిర్ణీత కాలంకంటే ముందుగానే రైతులు ఎంతగానో సహకరించి రుణాలు చెల్లింపులు చేసినట్లు వివరించారు. ఈ మేరకు కేడీసీసీ బ్యాంకు మేనేజర్ ఎం.సత్యనారాయణ, సూపర్వైజర్ పి. సత్యనారాయణలకు నూరుశాతం రుణాల వసూళ్ల వివరాలు తెలియచేశారు. సొసైటీ అభివృద్ధికి సహకారం అందిస్తున్న రైతులకు, సొసైటీ సిబ్బందికి, అధికారులకు చైర్ పర్సన్ గుత్తికొండ వంశీ కృష్ణ,సీఈవో శ్రీనివాసరావులు కృతజ్ఞతలు తెలిపారు.

# రైతులకు చేరువలో బ్యాంకింగ్ సేవలు -ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

- జిల్లాలో విస్తరిస్తున్న సహకార బ్యాంకింగ్ -కేడీసీసీబి చైర్మన్ నెట్టెం రఘురాం
- వెల్లటూరులో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన శాఖ ప్రారంభం
- నెట్టెం రఘురాం తో కలిసి బ్యాంకు నూతన శాఖ ను ప్రారంభించిన ఎమ్మెల్యే వసంత





**జి.కొండూరు,జూన్ 25 (వార్తాప్రభ) :** రైతులు,మహిళలకు మరింత చేరువలో కేడీసీసీ బ్యాంకింగ్ సేవలు అందించడ మే కూటమి ప్రభుత్వం లక్ష్యమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెల్లటూరు గ్రామంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (కేడీసీసీబీ) నూతన శాఖను కేడీసీసీబి చైర్మన్ నెట్టెం రఘురాం,శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు సంయుక్తంగా గురువారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వెల్లటూరు, చుట్టుపక్కల గ్రామాల ప్రజల చిరకాల కోరిక నేడు నెరవేరిందని,ఈ నూతన శాఖ ద్వారా రైతులకు సకాలంలో పంట రుణాలు, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహకారం వేగంగా అందుతుందని తెలిపారు.

**జిల్లాలో విస్తరిస్తున్న సహకార బ్యాంకింగ్-కేడీసీసీబి చైర్మన్**




**నెట్టెం రఘురాం..** కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కేడీసీసీబీ పనిచేస్తోందన్నారు.వెల్లటూరు బ్రాంచ్ ఏర్పాటుతో ఈ ప్రాంత రైతులకు, మహిళా సంఘాలకు మరింత సౌలభ్యం కలుగుతుందని, డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరు, రికవరీలో మన బ్యాంకు రాష్ట్రంలోనే ముందంజలో ఉందన్నారు.

**అందుబాటులో సేవలు:** మరోవైపు బ్యాంక్ అధికారులు బ్యాంక్ సేవల గురించి వివరించారు.నూతన శాఖ ద్వారా పంట రుణాలు, డ్వాక్రా రుణాలు, బంగారు రుణాలు, వ్యవసాయ అనుబంధ రుణాలు, డిపాజిట్ పథకాలు, ఇతర బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.రైతులు పాస్‌బుక్, ఆధార్ కార్డుల తో నేరుగా లావాదేవీలు నిర్వహించుకోవచ్చు అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెదేపా మండల పార్టీ నాయకులు, వివిధ గ్రామాల పిఏసిఎస్ చైర్మన్లు, స్థానిక టీడీపీ నాయకులు కార్యకర్తలు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోటెత్తిన పుట్రేల మారెమ్మ తల్లి వారి ఆలయం





**విస్సన్నపేట,జూన్ 25 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారం ముగ్గురమ్మల మూలపుటమ్మ కడు పెద్దమ్మ శ్రీ మారెమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో పూర్వక ధ్వజస్తంభ ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది. ధ్వజస్తంభ ప్రతిష్ట ఉత్సవ మహోత్సవ సంబరాలకు ఆడపడుచులు పోటెత్తారు. స్వాతి నక్షత్ర యుక్త శుభలగ్నం ఉదయం 10 గంటల 44 నిమిషాలకు పలు పార్టీల నాయకులు పలు శాఖల అధికారులు వేలాది మంది భక్తులు సమక్షంలో నైనానందకారంగా న భూతో న భవిష్యతి అన్న చందంగా చూసేవారికి చూడముచ్చటగా కన్నుల పండుగగా జరిగింది. నవధాన్యాలు బంగారం వెండి కాసులు తదితరాలను వేదపండితులు నిర్ణయించిన బ్రహ్మ ముహూర్తంలో పూర్వక ధ్వజస్తంభ ప్రతిష్ట సమయంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు, టిడిపి తిరువూరు నియోజకవర్గ సీనియర్ యువ నాయకులు వల్లభనేని గిరిబాబు( ఎన్ఆర్ఐ ) , మారెమ్మ గుడి చైర్మన్ టి శ్రీనివాసరావు, మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు, పుట్రేల గ్రామ పార్టీ అధ్యక్షులు అరిగే శ్రీనివాసరావు, మండల టిడిపి కోశాధికారి జివిఆర్,కలగర గ్రామ టిడిపి అధ్యక్షులు వల్లభనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎంపిటీసీ దామోదర్ రెడ్డి, వీర రాఘవపురం టిడిపి సీనియర్ నాయకులు రమేష్, విస్సన్నపేట క్లస్టర్ ఇంచార్జ్ నెక్కలపు శ్రీనివాసరావు (డాబా శ్రీను) అక్షరా విద్యాసంస్థల అధినేత ధనుంజయ్,ఆలయ ఈవో విడిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సేవ చేయగలిగిన వారే శాశ్వత ఐశ్వర్యవంతులు

- డబ్బుంటే ధనవంతులు కారు
- సేవా భావంతో ధనవంతులు కాగలరు
- శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆశ్రమంలో కూరగాయలు వితరణ
- ఆర్ అండ్ బి ఉద్యోగి సజ్జా రామ బ్రహ్మేశ్వర రావు, తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పలు సేవలు
- సేవల కు పలువురి అభినందనలు



**నూజివీడు,జూన్ 25 (వార్తాప్రభ) :** నూజివీడు పట్టణంలోని శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆశ్రమంలో సజ్జా రామ బ్రహ్మేశ్వర రావు, తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కూరగాయలు, పండ్లు, న్యూట్రిషన్ ఫుడ్ వితరణగా అందించారు. శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు పంద్రంగి సత్యనారాయణమూర్తి, బ్రహ్మచారి భాస్కరన్ జీ లు మాట్లాడుతూ ధనం కలిగి ఉంటే ఐశ్వర్యవంతులు కారని... సామాజిక సేవా భావం కలిగిన ప్రతి ఒక్కరూ శాశ్వత ఐశ్వర్యవంతులు కాగలరని తెలిపారు. ఆర్ అండ్ బి ఉద్యోగి సజ్జా రామ బ్రహ్మేశ్వర రావు పుట్టినరోజు సందర్భంగా కూరగాయలు, పండ్లు, న్యూట్రిషన్ ఫుడ్ వితరణగా పెద్దలకు అందించడం అభినందనీయమన్నారు. తిరి వీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సందర్భాలలో ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ తిరివీధి కృష్ణ చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. వేసవికాలంలో యాచకులు, నిరుపేదలకు పాదరక్షలు, పేదలకు అనేక సందర్భాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి కళ్ళజోళ్ళు, మందులు ఉచితంగా అందించడం, పేద విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందించిన తీరు నేటి యువతరానికి ఆదర్శనీయమన్నారు. తల్లిదండ్రుల పేరిట సేవా ట్రస్ట్ ఏర్పాటు చేసి కృష్ణ తన స్నేహితులు, సన్నిహితులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో అనేక సందర్భాలలో శ్రీ రామకృష్ణ సేవా సమితికి కూరగాయలు వితరణ చేస్తున్న విధానం ఎంతో ఆనందం కలిగిస్తుందన్నారు. వృత్తిపరంగా న్యాయవాదిగా కొనసాగుతున్న కృష్ణ తన తోటి మిత్రులకు అవగాహన కల్పిస్తూ, సేవా భావం వైపు మళ్లించి, శ్రీ రామకృష్ణ సేవా సమితిలో ఆశ్రయం పొంది నిత్యం అన్నదానంలో భోజనం స్వీకరిస్తున్న ఏ ఆసరా లేని పెద్దలను ఆదుకునే తీరు ముందు తరాలకు ఆచరణీయమన్నారు.

# ప్రజల నుండి సమస్యలు తెలుసుకునేందుకే ప్రజా దర్బారు - ఎమ్మెల్యే వెనిగండ్ల



**గుడివాడ,జూన్ 25 (వార్తాప్రభ) :** ప్రజల నుండి సమస్యల తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రజా దర్బాను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం స్థానిక ఏలూరురోడ్లుఓని ప్రజా వేదికలో ప్రజల నుండి ఎమ్మెల్యే అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక కార్యాలయంలో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను అర్జీల రూపంలో అందించవచ్చున్నారు. గుడివాడ వరకు రాలేని వారి కోసం ప్రతి వారం క్రమం తప్పకుండా గ్రామాల్లో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. అప్పుడు గ్రామంలో లేకపోతే సమీప గ్రామాల్లో నిర్వహించినప్పుడు వచ్చి అర్జీలు ఇవ్వవచ్చనీ ప్రజానీకానికి ఆయన సూచించారు. కొన్ని సమస్యలు సాంకేతిక కారణాలతో ఆలస్యమైనా శక్తి వంచన లేకుండా పరిష్కరిస్తామని, ప్రజా శ్రేయస్సు కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. వాహన యాప్ రెండు రోజుల్లో ఓపెన్ అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, టిడిపి పట్టణ అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నేరుసు కాశి, జనసేన జిల్లా నాయకులు పాలంకి సారధి, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన మండల టిడిపి అధ్యక్షులు - రాయల సుబ్బారావు

**విస్సన్నపేట,జూన్ 25 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని మాట్లాడుతూ ప్రతి ఒక్క కుటుంబానికి ఆక్సిజన్ అందించే శక్తి మొక్కలకు ఉంటుందని మనమందరం ఇంటింటా మొక్క నాటుదామని ఆయన పిలుపునిచ్చారు.



## జనసేన నిర్మాణ సారథిగా ఇంటి సాయికిరణ్



**కృత్తివెన్ను,జూన్ 25 (వార్తాప్రభ) :** జనసేన పార్టీ నిర్మాణ సారథిగా ఇంటి సాయికిరణ్ నియమితులయ్యారు. సమాచార సేకరణకు గాను పార్లమెంట్ స్థాయిలో కమిటీ నియమించారు. నియోజకవర్గ నుంచి ముగ్గురికి స్థానం లభించింది. కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సాయికిరణ్ పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఇటీవల నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కూడా చురుగ్గా పాల్గొన్నాడు.

## జనసేన పార్టీ పార్లమెంట్ కమిటీ పరిశీలకులు గా ఉర్లాపు పోలరాజు (యు.పి.రాజు)



**రాజాం,జూన్ 25 (వార్తాప్రభ) :** రాజాం నియోజకవర్గం సీనియర్ నాయకులు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉర్లాపు పోలరాజు (యు.పి.రాజు ) ను జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ విజయనగరం పార్లమెంట్ పరిశీలకులుగా పవన్ కళ్యాణ్ నియమించారు.ఈ సందర్భంగా యు.పి.రాజు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గారు ఈ కమిటీలను ఏర్పాటు చేసారని రాజాం నియోజకవర్గం నుంచి నాకు ఈ అవకాశం కల్పించిన జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ గౌరవ ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పార్టీ సిద్ధాంతాలుకు కట్టుబడి పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని మరింత శ్రమించి పనిచేస్తానని పేర్కొన్నారు.

## ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ చైర్మన్ టి శ్రీనివాసరావు



**విస్సన్నపేట,జూన్ 25 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో పుట్రెల మారెమ్మ అమ్మవారి ఆలయంలో జరిగిన పూర్వక ధ్వజస్తంభ స్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో ఆలయ చైర్మన్ టి శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షులు అరిగే శ్రీనివాసరావు, ధనుంజయ్, ఈవో వి డి డి ప్రసాద్, మండల టిడిపి మాజీ అధ్యక్షులు మట్టా వేణుగోపాలరావు దంపతులు, తిరువూరు నియోజకవర్గ వైసిపి యూత్ కన్వీనర్ దేశి రెడ్డి శ్రీనివాసరెడ్డి, కలగర గ్రామ మాజీ సర్పంచ్ దేశి రెడ్డి రమా శ్రీనివాసరెడ్డి, కిట్టు మ్యాంగోస్ అధినేత రాయల కిట్టు తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ చేతుల మీదగా ఉత్తమ కార్యకర్త అవార్డు అందుకున్న పాలడుగు




**కోడూరు, జూన్ 25 (వార్తాప్రభ) :** కోడూరు మండల పరిధిలోని జయపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు ఆనందరావు ఉత్తమ కార్యకర్త అవార్డు అందుకున్నారు. మోపిదేవి మండల జరిగిన కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర, ఐటీ విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ చేతుల మీదగా బెస్ట్ కార్యకర్త అవార్డు ను అందుకోవడం జరిగిందని పాలడుగు ఆనందరావు తెలిపారు. కాగా ఆనందరావు తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తూ, వారి సతీమణి పాలడుగు భార్గవి మొన్నటి వరకు జయపురం సర్పంచ్ గా కూడా పనిచేశారు. బెస్ట్ కార్యకర్త అవార్డు అందుకున్న ఆనందరావుకు పలువురు నాయకులు అభినందనలు తెలియజేశారు..

## ఘనంగా ఎమ్మెల్యే వనమాడి పుట్టినరోజు వేడుకలు

- చోడిపల్లి సతీష్ ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు
- విద్యార్థులకు పుస్తకాలు,పండ్లు, పంపిణీ



**కాకినాడ,జూన్ 25 (వార్తాప్రభ) :** కాకినాడ సిటీ శాసన సభ్యులు వనమాడి కొండబాబు పుట్టినరోజు పురస్కరించుకొని 10వ డివిజన్ దుమ్ములపేట తెలుగు దేశం పార్టీ ఇన్చార్జి చోడిపల్లి సతీష్ ఆధ్వర్యంలో బులుసు సాంబమూర్తి చెవిటి, మూగ వికలాంగుల బాలికల వసతి గృహం, పాఠశాల నందు కాకినాడ జిల్లా ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షులు వనమాడి మోహన్,కాకినాడ నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు చేతుల మీదుగా కేక్ కటింగ్ చేసి పిల్లలకు పుస్తకాలు, విద్యార్థులకు కావలసిన కిట్లను, పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో కొయ్యా తాతారావు,మల్లె దయ,వాసు పెల్లి సంతోష్,దూడ ప్రసాద్, వాసుపల్లి రాజయ్య, ఈడిద సత్తిబాబు, మెరుగు కోదండరావ్, మెరుగు అప్పన్న, కొయ్యా రాజు, 10వ డివిజన్ కు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితా!!

- పారదర్శకంగా ఎస్ఐఆర్-2026 అమలు చేయాలి
- ఇంటింటి సర్వేతో పకడ్బందీగా ఓటరు జాబితా
- అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం
- రామగుండం మేయర్ మహంకాళి స్వామి
- మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ



పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 25 (వార్తాప్రభ ప్రతినిధి) రామగుండంలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎస్ఐఆర్-2026 పై అధికారులు సమీక్ష నిర్వహించారు. గురువారం ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు కీలక సూచనలు చేశారు మేయర్, మున్సిపల్ కమిషనర్. ఈ సందర్భంగా మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ, ఎస్ఐఆర్-2026 అనేది చాలా ముఖ్యమైన కార్యక్రమం. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనది. 18 ఏళ్లు నిండిన ఒక్క అర్హుడి పేరు కూడా ఓటరు జాబితాలో మిస్ కాకూడదు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి, బాధ్యతగా సర్వే చేయాలి. ఎలాంటి పొరపాట్లకు, రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా పారదర్శకంగా పని చేయాలి. డూప్లికేట్ ఓట్లు, చనిపోయిన వారి పేర్లు తొలగించాలి. ఇది మనందరి బాధ్యత అని తెలిపారు మేయర్. అనంతరం అడిషనల్ కలెక్టర్, రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ మాట్లాడుతూ, ఎస్ఐఆర్-2026 షెడ్యూల్‌ను ప్రతి ఒక్క బీఎల్‌వో కచ్చితంగా పాటించాలి. కొత్త ఓటరు నమోదు, చిరునామా మార్పులు, తొలగింపులకు సంబంధించి వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి. ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా సకాలంలో పరిష్కరించాలి. డూప్లికేట్ ఎంట్రీలు, లాజికల్ ఎర్రర్లను రోజువారీగా సరిచేయాలి. టెక్నాలజీని పూర్తిగా వాడుకుంటూ, గరుడ యాప్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలి. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎల్లయ్య, రామగుండం తహశీల్దార్ రవీందర్ రావు, రెవెన్యూ, ఎన్నికల విభాగం సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆడబిడ్డలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసిన... మాజీ కార్పొరేటర్ బల్లి రోజా శ్రీనివాస్.



జవహర్ నగర్, జూన్ 25:(వార్తా ప్రభ)తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంకీసర సర్కిల్ జవహర్ నగర్ జిహెచ్ఎంసి పరిధిలోని మూడో డివిజన్ లో పాత గబ్బిలాల్ పేట కాలనీలో మాజీ కార్పొరేటర్ బల్లి రోజా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం మరియు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి సదానందం, మాజీ కార్పొరేటర్ కుతాడి సాయి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గజ్వేల్ శంకర్, నంగునూరు అశోక్, మరియు వెంకటేష్, ఆనంద్, సాయి, బాలకృష్ణ, యాకభి, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం

## ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న... ముప్పా రామారావు, ఈగ శ్వేతా రాజు ముదిరాజ్



కీసర, దమ్మాయిగూడ, జూన్ 25:(వార్తా ప్రభ) రాష్టంలో మహిళల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావు అన్నారు. బుధవారం దమ్మాయిగూడ డివిజన్ ఆర్జీకే కాలనీలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్పా రామారావు కాంగ్రెస్ నాయకులతో కలిసి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా రామారావు మాట్లాడుతూ.. మహిళల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ క్యాంటీన్, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా శక్తి బృందాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కీసర డిసి రామలింగం, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, బీ బ్లాక్ అధ్యక్షురాలు ఈగ శ్వేతా రాజు ముదిరాజ్, కీసర గుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యుడు ప్రసాద్ గౌడ్, మాలమహానాడు అధ్యక్షుడు గుజ్జుక పరశురామ్, మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## 5 కే రన్ లో యువత పెద్దా ఎత్తున పాల్గొనాలి.డీఎస్పీ జీవన్ రెడ్డి

అదిలాబాద్ జూన్ 25:(వార్తా ప్రభ) నషా ముక్త్ భారత్ సప్తహాలో భాగంగా ఈరోజు 26న మాదక ద్రవ్యాల కు అందరూ దూరముండాలని ముఖ్యముగా యువత తమ తమ ఆరోగ్యాలు కాపాడుకుంటూ సమాజానికి ఉపయోగ పడాలనే ఉద్దేశం తోనే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రన్ ఫర్ ఫిట్నెస్ రన్ ఫర్ యాంటీ డ్రగ్ నినాదంతో మన ఎస్పీ అఖిల్ మహాజన్ నేతృత్వంలో జిల్లా కేంద్రం లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి 5 కే రన్ నిర్వహిస్తున్నామని డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు

# జన సంద్రంలా సాగిన మాదకద్రవ్యాల నిర్మూలన ర్యాలీ

- రైల్వే స్టేషన్ నుండి ప్రకాశం స్టేడియం వరకు పోలీసుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి-: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు






భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలతో కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం నాడు మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహనా కార్యక్రమాలను గురువారం కొత్తగూడెం పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించారు. రైల్వే స్టేషన్ నుండి ప్రకాశం స్టేడియం వరకు సాగిన ఈ ర్యాలీలో స్థానికులు,విద్యార్థులు ,ప్రజాప్రతినిదులు,పుర ప్రముఖులు తదితరులు బారీ సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రకాశం స్టేడియంలో మాదక ద్రవ్యాల నిర్మూలన సదస్సు అట్టహాసంగా నిర్వహించారు.?ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం యువతను, విద్యార్థులను మాదక ద్రవ్యాల (డ్రగ్స్) కోరల నుండి రక్షించడం, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై సమగ్ర అవగాహన కల్పించడం.జిల్లాలోని అన్ని మండలాలు,గ్రామాలు ముఖ్యంగా విద్యా సంస్థలు,కళాశాలల్లో పోలీసు అధికారులు,సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహనా సదస్సులు,ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.విద్యార్థులు,యువత,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ప్రజా ప్రతినిధులను ఈ అవగాహనా కార్యక్రమాల్లో భాగం చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం అనేది వ్యక్తిగత సమస్య కాదని,ఇది సామాజిక రుగ్మత అని,దీనిపై పోలీసులతో పాటు ప్రతి పౌరుడు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు స్నేహితుల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని, సినిమాలలోని మంచిని గ్రహించి చెడుని వదిలేయాలని, క్రీడలు,కళలు,సాంస్కృతిక కార్యక్రమాలు వంటి సానుకూల ప్రత్యామ్నాయాలను అలవాటు చేసుకుని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు..?జిల్లాను డ్రగ్స్ రహిత భద్రాద్రి గా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని,డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని ధైర్యంగా తమకు తెలియజేయాలని కోరారు. అనంతరం సైబర్ నేరాల గురించి మాట్లాడుతూ అత్యాశకు పోయి త్వరితగతిన డబ్బును సంపాదించాలనే ఆలోచనతో చాలామంది సైబర్ నేరాల బారిన పడి కష్టపడి సంపాదించిన నగదును కోల్పోతున్నారని,చదువుకున్నవారే ఎక్కువమంది సైబర్ నేరాలు బారిన పడుతున్నారని తెలిపారు.ఓటీపి ట్రాప్,ఆన్లైన్ ట్రేడింగ్,సోషల్ మీడియాల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు.విద్యార్థినులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని, మహిళల భద్రతపై పలు సూచనలు చేశారు. అనంతరం రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే చాలావరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని, హెల్మెట్ వినియోగం,సీటు బెల్ట్ ప్రాధాన్యత,డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు. సుమారు 1500మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో కమాండెంట్ పి.సి.వి.రమణ, కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ,అసిస్టెంట్ కమాండెంట్ లు హెచ్.అబ్దుల్ రషీద్, బి.మరియధాసు, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ స్వర్ణలత లేనినా,పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రగ్స్, సోషల్ మీడియాకు బానిస కావద్దు!!

- జీవితంలో మత్తు వద్దు, ముందుకు నడవండి
- ఫేస్ బుక్, ఇన్‌స్టా, స్నాప్ మాయలో పడకండి
- చాటింగ్ కాదు, చదువు ముఖ్యం
- విద్యార్థులకు డీసీపీ రాంరెడ్డి పిలుపు







పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 25(వార్తాప్రభ ప్రతినిధి)డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు బానిసలై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి సూచించారు. గోదావరిఖని ఉప్పర సంఘం కార్యాలయంలో గురువారం ఇంటర్ విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీపీ రాంరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

**డీసీపీ రాంరెడ్డి సూచనలు** మత్తుకు దూరం: డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దు. ఒక్కసారి అలవాటు పడితే బయటపడటం కష్టం.సోషల్ మీడియా వల ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, ఫేస్ బుక్, వాట్సాప్ చాటింగ్‌లకు బానిసలై సమయాన్ని వృథా చేసుకోవద్దు. మొబైల్ ఫోన్‌కు దాసోహం కావద్దు. తల్లిదండ్రుల గౌరవం తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తించి, వారు తలెత్తుకునేలా నడుచుకోవాలి. చట్టానికి లోబడిపోలీస్ స్టేషన్‌కు వచ్చి తలదించుకునే పనులు ఎప్పుడూ చేయవద్దు. చిన్న తప్పు కూడా జీవితాన్ని మార్చేస్తుంది.యువత దేశానికి వెన్నెముక లాంటిదని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత చదువులతో తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని డీసీపీ ఆకాంక్షించారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసిపి మడత రమేష్ గౌడ్, 1టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇంద్రసేనారెడ్డి, స్థానిక పోలీసు అధికారులు, కళాశాల అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్ దళిత సంక్షేమ భవన్ లోకామ్రేడ్స్ అనిత,శిరిషాల సంతాప సభ

-పిఓడబ్ల్యూ(విముక్తి) మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా నాయకురాలు ఎం.పుణ్యవతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమం.



జవహర్ నగర్, జూన్ 25:(వార్తా ప్రభ)నిజామాబాద్ జిల్లా, బోధన్ కు చెందిన పిఓడబ్ల్యూ (విముక్తి) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకురాలిగా కొనసాగిన షాపురం అనితక్క మరియు ఆమె కుమార్తె, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారిణి కాకడి శిరిషాల అకాల మృతికి విప్లవ జోహార్లు తెలియజేశారు. 2026, జూన్-25, గురువారం రోజు, కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలో గల దళిత సంక్షేమ భవన్ లో పిఓడబ్ల్యూ(విముక్తి) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాయకురాలు మెరుగు పుణ్యవతి అధ్యక్షతన సంతాప సభను నిర్వహించారు. జూన్-22 నుండి 28 వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో కామ్రేడ్స్ అనిత, శిరిషాల సంతాప సభలు, సమావేశాలు జరపండని సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ, కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో బాగంగా జరిగిన కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి షేక్ షావలి, ఆడజన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షురాలు ధనలక్ష్మి, కె.ఎన్.పి.హెచ్. ఎస్. రాష్ట్ర అధ్యక్షురాలు జి.పుష్ప, టియుజేఏసి మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు సన్వాల సుచరిత, పిఓడబ్ల్యూ (విముక్తి)సెంట్రల్ కమిటి అధ్యక్ష, కార్యదర్శులు పి.సునీత, బి.లలిత, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రెండు తెలుగు రాష్ట్రాల కన్వీనర్ ఇనుప సురేష్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ కార్యదర్శి టి.కాలేషా, సైయద్, సలీం, మోఇన్, సాబీర్, జర్నలిస్ట్ కొన్నెవేణు, యమునా గౌడ్, శ్రీనివాస్ అశోక్, వెంకన్నతదితరులు పాల్గొని, ప్రసంగించారు. తల్లి కూతుర్ల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని గుర్తుచేశారు. షాపురం అనితక్క గుండెపోటుకు గురై అకాల మరణానికి గురైన మూడు రోజులకు ఆమె కుమార్తె అయిన కాకడి శిరిషా తొమ్మిది నెలలు నిండిన గర్భవతని అన్నారు. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన శిరిషా, తన కన్నతల్లే తన కడుపున పుట్టిందని సంబరపడిన రెండు రోజులకే లోబీపితో మూర్చకు గురై మరణించడం తీవ్రంగా కలిచివేసిందని అన్నారు. ప్రజా ఉద్యమాలకు, వర్గపోరాటాలకు బాసటగా నిలిచిన తల్లి, కూతుర్ల మృతి, విప్లవ ప్రతిఘటనోద్యమాలకు పూడ్చని లోటు అని పేర్కొన్నారు. వారి అకాల మృతికి తీవ్ర సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు మరియు బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కామ్రేడ్ అనిత సాయుధ విప్లవ కారిణిగా, ప్రజా సంఘ నాయకురాలిగా అనేక ప్రజా ఉద్యమాల్లో, వర్గ పోరాటాల్లో చురుకుగా కొనసాగిందని, చిన్ననాటి నుండే తల్లిదండ్రుల అడుగు జాడల్లో అరుణోదయ ప్రజా కళాకారిణిగా సభలు, సమావేశాల్లో శిరిషా పాల్గొనేదని గుర్తుచేశారు. తల్లి, కూతురు ఇద్దరు కూడ నిజామాబాద్ ప్రాంతంలో బీడి కార్మిక, రైతు, ఇతర ప్రజా సమస్యలపైన ఉద్యమించారని అన్నారు. మహిళలను సమీకరించి, భూమి, ఇళ్ళ స్థలాల కొరకు పోరాడారని గుర్తుచేశారు. గత మూడు సంవత్సరాల కిందట 21 సంవత్సరాలు ఉన్న కుమారిడి మరణం తల్లిని మనోవేధనకు గురిచేస్తే, తన అన్నయ్య షాపురం శివతో పాటు తల్లి మరణం కూడ శిరిషాను తీవ్ర మానసిక వేదనకు గురి చేసిందని అన్నారు. భౌతికంగా దూరమైన తల్లి కూతురు, సదా ప్రజా ఉద్యమాల్లో సజీవంగా ఉంటారని గుర్తుచేశారు. అనంతరం అనిత, శిరిషాల చిత్రపటానికి పూలమాల సమర్పించి, రెండు నిముషాలు సంతాప సూచికంగా మౌనం పాటించి, ఘన నివాళులు తెలియజేశారు.

# ప్రజలతో మమేకమై వ్యాపార రంగాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలి

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



కోదాడ, జూన్ 25 (నేటి మనదేశమ్): వ్యాపార రంగం అంటేనే నమ్మకం అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఈరోజు కోదాడ పట్టణంలో కాకతీయ కమ్మ సేవా సమితి ఏసీ ఫంక్షన్ హాల్ ను ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయనఫంక్షన్ హాల్ దగ్గర తన ఉపన్యాసాన్ని అందించి తిరిగి ప్రయాణమై రామాపురం క్రాస్ రోడ్డు దగ్గర శ్రీహర్ష ట్రక్కింగ్ భారత్ బెంజ్ ను సందర్శించారు.వ్యాపార రంగం అంటేనే నమ్మకం అని ప్రజలతో మమేకమై వ్యాపారాన్ని అభివృద్ధి పరచాలని మేనేజ్మెంట్ వాళ్లకు సూచించారు.ఈ కార్యక్రమంలోభారత్ బెంజ్ ఏరియా మేనేజర్ వసీం, సేల్స్ వైస్ ప్రెసిడెంట్, వెంకటరమణ, ఏరియా సేల్స్ హెడ్ కిరణ్ కుమార్, బిజినెస్ మేనేజర్ సత్యనారాయణ, ఆఫీస్ స్టాఫ్ నాగరాజు కుమార్ ల తో ముచ్చటించి బిజినెస్ డెవలప్మెంట్ గురించి మాట్లాడి అనంతరం అక్కడి నుండి వెళ్ళిపోయారు.

# వార్తా ప్రభ హైదరాబాద్

## పశువైద్యుడు అందుబాటులో ఉండడం లేదని రైతులు ఆందోళన

సీజన్ వ్యాధులతో మరణిస్తున్నాయి అంటున్నా రైతులు




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)సుజాతనగర్, వర్షాకాలం పశువులకు సీజన్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది కొత్తగూడెం కార్పొరేషన్ 22 డివిజన్ పరిధిలోని పశు వైద్యశాలలో పరిస్థితి మరి తీసికట్టుగా ఉంది. పశు వైద్యశాలకు వైద్యులు లేక డిప్యూటేషన్ పై వచ్చిన వైద్యులు సరైన సమయానికి లేక సకాలంలో సరైన వైద్యం అందక పశువులు మృత్యువాత పడటంతో పాడి రైతులకు తీరని నష్టాన్ని కలిగిస్తుందని ఆగ్రహిస్తున్న రైతులు ఎండలు విపరీతంగా పెరిగిపోవడంతో పశువులకు వస్తున్న రోగాలకు చికిత్స చేయించేందుకు దవాఖానకు వస్తే డాక్టర్లు లేక వసూలు మృతి చెందుతున్నాయని తీవ్ర ఆవేదం వ్యక్తం చేస్తున్న రైతులు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని. ప్రతిరోజు డాక్టర్ దవాఖానకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి పశు వైద్యశాలలో అన్ని వసతులు కల్పించి పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి పశువులను కాపాడవలసిందిగా పలువురు రైతులు తెలిపారు

## కాలనీ అభివృద్ధి పనులకు లక్ష విరాళం అందించిన మిరియాల ప్రీతమ్




శేరిలింగంపల్లి,జూన్ 25 (వార్తాప్రభ):చందానగర్ డివిజన్ పరిధిలోని న్యూ శంకర్ నగర్ కాలనీలో నిర్మించనున్న మండపం మరియు కమిటీ హాల్ పూజ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిరియాల ప్రీతమ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి పనుల కోసం రూ.1 లక్ష విరాళాన్ని ప్రకటించారు.కాలనీ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తున్నట్లు మిరియాల ప్రీతమ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ పాల్గొని మిరియాల ప్రీతమ్ సేవా కార్యక్రమాలను అభినందించారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మిరియాల రాఘవరావు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.మిరియాల ప్రీతమ్ ప్రకటించిన విరాళంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సేవలో ముందుండే నాయకుడిగా మరోసారి తన నిబద్ధతను చాటుకున్నారని కాలనీ వాసులు పేర్కొన్నారు.

## ఉద్యమ నేత దివంగత పద్మారావుకు నివాళు లర్పించిన దేశపతి శ్రీనివాస్ దేవి ప్రసాద్ ...




కూకట్ పల్లి, జూన్ 25(వార్తాప్రభ):తెలంగాణ ఉద్యమ నేత ప్రముఖ సినీ నిర్మాత దివంగత గొట్టిముక్కల పద్మారావు చిత్రపటానికి ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ దేవి ప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తొలి మలిదశ ఉద్యమంలో గొట్టిముక్కల పద్మారావు ప్రత్యక్షంగా పాల్గొని పరాష్టకం కోసం మన వంతు కృషి చేశారని కొనియాడారు.ఆయన ఆశయాలను సోదరులైన గొట్టిముక్కల పాండురంగారావు వెంకటేశ్వరరావు ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు.



నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు దివ్య సాయి గార్డెన్ డ్రైనేజీ మరియు రోడ్డు సమస్యలపై మల్కాజ్గిరి డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డి ని కలిసి కాలనీ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేసిన కాలనీ అధ్యక్షులు కొల్లు వెంకటరెడ్డి, మరియు ఉపాధ్యక్షులు సంతోష్ రెడ్డి.కీసర, నాగారం, జూన్ 25:(వార్తా ప్రభ)

# సంపాదకీయం

## కాపు గేర్..ఫ్యాన్ స్పీడ్‌ను పెంచేనా.?

గత ఎన్నికల్లో ఘోర ఓటమి. మళ్లీ తిరిగి పవర్‌లోకి రావాలి. తలపడి నిలబడాలన్న పట్టుదల. కానీ కూటమి పొత్తు..క్యాస్ట్ ఈక్వేషన్స్ వైసీపీని టెన్షన్ పెడుతున్నాయి. అందుకే మల్టీపుల్ ప్లాన్స్‌తో ముందుకెళ్తోంది వైసీపీ. కూటమిని డిస్టర్బ్ చేసే పరిస్థితి లేకపోవడంతో..ప్రభుత్వంపై వ్యతిరేకత..కులాల ఓటు బ్యాంకుపై ఫోకస్ పెట్టినట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలోనే లేటెస్ట్‌గా కాపు ఎజెండాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్లాన్ చేస్తోంది. ఏకంగా వైసీపీ కాపు నేతలంతా ఏకతాటిపైకి వచ్చి..జగన్ డైరెక్షన్‌లో పకడ్బందీ వ్యూహాన్నే అమలు చేసేందుకు పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో సిక్కోలులో తూర్పు కాపుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్‌కు మండలిలో ప్రతిపక్ష నేత, వైసీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ హాజరయ్యారు. ఆ తర్వాత ఓవర్ టు కోనసీమ అన్నారు. వెంకటాయపాలెంలో మాజీమంత్రి తోట త్రిమూర్తులు పెట్టిన మీటింగ్‌తో వైసీపీ కాపు గేర్ స్పీడందుకున్నట్లేనన్న టాక్ వినిపిస్తోంది.కాపు ఓటు బ్యాంక్ ఫ్లాష్‌బ్యాక్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో 'కాపు సామాజికవర్గం' అత్యంత కీలకమైన, నిర్ణయాత్మకమైన పాత్ర పోషిస్తోంది. రాష్ట్రంలో సుమారు 15 నుండి 18శాతం ఓటు బ్యాంక్ కలిగిన ఈ వర్గం, ఏ పార్టీ వైపు మొగ్గు చూపితే ఆ పార్టీ అధికారంలోకి రావడం గత మూడు ఎన్నికల ఫలితాలు బట్టి చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో కాపులు టీడీపీకి అండగా నిలిచారు. ఆనాడు రాష్ట్ర ప్రజలు..అనుభవం ఉన్న చంద్రబాబు అధికారంలో ఉంటే నవ్యాంధ్ర బాగుపడుతుందని విశ్వసించారు. ఇక ఆ తర్వాత 2019లో జనసేన ఒంటరిగా పోటీ చేసింది. అప్పుడు కాపు ఓట్లు చీలిపోయాయి. మెజారిటీ కాపులు వైసీపీ వైపు మొగ్గు చూపడం, టీడీపీపై ఉన్న వ్యతిరేకత కలిసి వైఎస్ జగన్ 151 సీట్లతో భారీ విజయం సాధించారు. ఇక 2024కు వచ్చేసరికి సీన్ మారిపోయింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడటంతో కాపు ఓటు బ్యాంక్ వన్‌సైడ్‌గా కూటమి వైపు నిలిచింది. పవన్ కల్యాణ్ ప్రభావంతో గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వైసీపీ తీవ్రంగా నష్టపోయింది. కాపుదారిలో వైసీపీ వ్యూహాలు వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారం చేపట్టాలని భావిస్తున్న వైసీపీ, కాపు రాజకీయాన్ని తెరమీదకు తెస్తోంది. వైసీపీలో ఉన్న కీలక కాపు నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చి కూటమిపై స్ట్రాంగ్ ఫైట్‌కు దిగుతోంది. కూటమి ప్రభుత్వంలో కాపులకు ఆశించిన స్థాయిలో పదవులు రాలేదని..జనసేనకు దక్కాల్సిన గౌరవం దక్కడం లేదనే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్లాన్ చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో కాపు నేస్తం వంటి పథకాల ద్వారా లబ్ధి పొందిన వర్గాలను మళ్లీ తమ వైపు తిప్పుకోవడమే ఎజెండాగా పెట్టుకుంది. ఇప్పుడు కూటమి సర్కార్ కాపులకు చేసిందేమి లేదని..పవన్ ఎప్పుడూ సీఎం కాలేదని విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఈ విషయంలో వైసీపీ కాపు నేతలే మీడియా మైకుల ముందుకు వచ్చి గళం వినిపిస్తున్నారు.పవన్‌ను కాదని..కాపులు వైసీపీకి మద్దతిచ్చేనా.? అయితే కాపు రాజకీయం ద్వారా వైసీపీ మళ్లీ పుంజుకోవడం అంత ఈజీ కాదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాపు సామాజికవర్గంలో, ముఖ్యంగా యువతలో పవన్ కల్యాణ్‌కు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. పైగా ఇన్నాళ్లకు పవన్ రూపంలో కాపుల నుంచి ఓ బలమైన ప్రజాదరణ ఉన్న నాయకుడు..సీఎం అయ్యే స్థాయి నేత రాజకీయ రణక్షేత్రంలోకి దిగారు. అలాంటప్పుడు కూటమిపై ప్రజల్లో అసంతృప్తి ఉన్నా..తమకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్న నిరాశ ఉన్నా..పవన్‌ను కాదని కాపులు ఉన్నఫళంగా వైసీపీవైపు రావడం ఇప్పట్లో అయ్యే పని కాదంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు. అయితే క్షేత్రస్థాయిలో మంచి పేరున్న కూటమి నేతలు వైసీపీలో ఉండటం ఆ పార్టీకి ప్లస్ పాయింగ్‌గా చెబుతున్నారు. ఇక కాపు రిజర్వేషన్ల విషయంలో గతంలో వైసీపీ అనుసరించిన వైఖరిపై ఇప్పటికీ ఆ వర్గంలో కొంత అసంతృప్తి ఉందంటున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను బట్టి చూస్తే, కాపు రాజకీయం మాత్రమే ఒంటరిగా వైసీపీని అధికారంలోకి తీసుకురాలేదనేది సుస్పష్టం. కానీ కూటమిపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను క్యాష్ చేసుకోవడంలో వైసీపీ ఎంత వరకు సక్సెస్ అవుతుందనేదే కీలకం కానుంది. పాలిటిక్స్ ఆల్ వైస్ డైనమిక్స్ కాబట్టి..ఎన్నికల నాటికి ఏపీలో పొలిటికల్ ఈక్వేషన్స్ ఎలా మారబోతున్నాయో వేచి చూడాలి మరి.

## 2004 ముందు ఆర్టీసీలో ఉద్యోగుల కూడా నేటి పింఛను స్కీమ్ అమలు చేయాలి



**విజయవాడ పశ్చిమ జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**2004 సెప్టెంబర్ కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 10,715 మంది ఉద్యోగులను (కాంట్రిబ్యూటీ పెన్షన్స్ కి) సిపిఎస్ నుంచి (ఓల్డ్ పెన్షన్ స్కీము) ఓపిఎస్ కు మరెందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా. చంద్రబాబునాయుడు కి ఏపీ పిటిడి (ఆర్టీసీ) బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(రి.నెం.260/21) రాష్ట్ర అధ్యక్షులు ఎస్పి. శేషగిరిరావు చంద్రబాబు నాయుడు కి ఓ ప్రకటనలో హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు., అలాగే 2020 నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన ఏపీఎస్ఆర్టీసీ 2004 ముందు ఉద్యోగాలలో నియమితులైన వారికి కూడా ఓపిఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్) ను అమలు జరపి, ప్రస్తుతం 3000 నుండి 5000 రూపాయల వరకు వచ్చే ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్(పి.ఎఫ్) మాత్రమే పొందుతున్నారని, ఓపిఎస్ అమలు జరపాలని గౌరవ ముఖ్యమంత్రి కి శేషగిరిరావు తన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## వృద్ధులకు అన్నదానం



**రెడ్డిగూడెం జూన్ 25(వార్తాప్రభ ప్రతినిధి ):**రెడ్డిగూడెం మండల కేంద్రంలో గల చిన్న పిల్లల వైద్యులు ఎస్ కె యూసఫ్ మనవడు షేక్ ఆర్మాన్ ఫైజ్ రెండో పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ వృద్ధుల డేకేర్ సెంటర్ నందు నిరుపేదలైన వారికి ప్రేమవిందు(అన్నదానం) నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి సంస్థ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

## అవుట్‌ఫాల్ డ్రైన్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరంలో చేపడుతున్న అవుట్‌ఫాల్ డ్రైన్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి, వర్షపు నీరు రహదారులపై నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా గాయత్రీనగర్, పెనమనేని పాలీ క్లినిక్ రోడ్, పటమట హైస్కూల్ రోడ్ తదితర ప్రాంతాలను సందర్శించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో నీటి నిల్వల సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పెనమనేని పాలీ క్లినిక్ రోడ్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న అవుట్‌ఫాల్ డ్రైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పటమట హైస్కూల్ రోడ్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అక్కడ అందిస్తున్న ఆహార నాణ్యత, త్రాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, సిబ్బంది పనితీరును సమీక్షించారు. అన్న క్యాంటీన్ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని, ప్రతిరోజూ నిర్ణీత సమయాల్లో సేవలు అందించాలని సూచించారు. క్యాంటీన్‌కు వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామారావు, అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ గోపాల్ నాయక్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాలయ భూములపై కూటమి కన్ను

**పోతిన మహేష్ సంచలన వ్యాఖ్యలు**



**విజయవాడ పశ్చిమ జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి పాలనలో హిందూ దేవాలయాలకు గ్రహణం పట్టిందని, పవిత్రమైన ఆలయ భూములను కొట్టేసేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున కుట్రలు చేస్తోందని వైసీపీ నాయకుడు పోతిన మహేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం కోమల విలాస్ వద్ద ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరము ఆయన మాట్లాడుతూ గత రెండేళ్లలో దేవాలయాల్లో ఎన్నో అపచారాలు జరిగాయని, భక్తులు భక్తితో ఇచ్చిన సుమారు 2 లక్షల ఎకరాల భూములను చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్పాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. అయోధ్య రామాలయ నిధుల్లో రూ. 200 కోట్ల గోల్‌మాల్ జరిగిందని చర్చ జరుగుతుంటే, అంతకంటే పెద్ద స్కామ్ ఆంధ్రప్రదేశ్‌లో దేవాలయ భూముల రూపంలో జరుగుతోందని మహేష్ విమర్శించారు. 1,38,000 ఎకరాలు కాదు, ఏకంగా 2 లక్షల ఎకరాలను అన్యకాంతం చేస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సచివాలయం సాక్షిగా స్వయంగా ఒప్పుకున్నారని ఆయన గుర్తు చేశారు. దేవాలయ భూములను దారి మళ్లించడంలో దిట్ట అయిన ఇన్‌ఛార్జ్ ఎండోమెంట్ కమిషనర్ రామచంద్రమోహన్‌కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల్లో అరిష్టాలు పెరిగిపోయాయని పోతిన మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలో ఆరుగురు భక్తులు, గోవులు మరణించడం దురదృష్టకరమన్నారు. విజయవాడ దసరా ఉత్సవాలను వ్యాపారంగా మార్చారని, కృష్ణా జిల్లాలో స్వామివారి కిరీటం మాయమైనా ఉలుకూ పలుకూ లేదని దుయ్యబట్టారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో హిందూ దేవాలయాలకు అండగా నిలిచారని మహేష్ కొనియాడారు. శ్రీవాణి ట్రస్ట్ ఏర్పాటు చేయడం, అర్చకుల జీతాలు పెంచడం వంటి చర్యల ద్వారా జగన్ తన భక్తిని చాటుకున్నారని చెప్పారు. చివరగా, సాయిబాబా దేవుడే కాదంటూ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీశాయని, రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం దీనికి తగిన శిక్ష అనుభవించక తప్పదని ఆయన హెచ్చరించారు.

## శ్యామ ప్రసాద్ ముఖర్జీ జీవితం యువతకు ఆదర్శం..




**విజయవాడ పశ్చిమ జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డా శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి (జూలై 6) మరియు బలిదాన్ దివస్ (జూన్ 23) సందర్భంగా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు బూత్ స్థాయిలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు గురువారం, భవానిపురం ఎన్డీయే కార్యాలయంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కూటమి నేతలు కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ తో కలిసి శ్యామ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.. ముఖర్జీ చేపట్టిన "ఒక దేశం, ఒకే రాజ్యాంగం" ఆశయాలను, ఆయన దేశానికి చేసిన త్యాగాలను బీజేపీ నాయకులు ప్రజలకు వివరించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సమైక్యత జాతీయత కోసం శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.దేశం కోసం ఆయన చేసిన త్యాగాలు, సిద్ధాంతాలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.. ఎన్టీఆర్ జిల్లా బీజేపీ వైస్ ప్రెసిడెంట్ నున్న కృష్ణ, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ వాణిజ్య విభాగం కన్వీనర్ పచ్చిపులుసు వెంకట శివప్రసాద్ , బీజేపీ మండల అధ్యక్షులు పగడాల కృష్ణ, దేవిన హరిప్రసాద్, బీజేపీ నేతలు బెన్నా భక్తుల సోమేశ్వరరావు, పోలవరపు దుర్గారావు, రామకృష్ణ, హరీష్ వ్యాస్, అడ్డూరి భాస్కరరావు కూటమి నేతలు పీవీ చిన సుబ్బయ్య, బొడ్డుపల్లి శ్రీనివాసరావు, చిన బాబు, కూర్మారావు,బొమ్ము రాంబాబు, నాగోతీ రామారావు, తమ్మిన లీల, ప్రదీప్ రాజ్ పాల్గొని శ్యామ ప్రసాద్ ముఖర్జీ కు నివాళులర్పించారు..

## మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం లక్ష్యం కావాలి

**ప్రముఖ సామాజిక వేత్త ఆకుల శ్రీనివాస్ పిలుపు**



**విజయవాడ పశ్చిమ జూన్ 25: (వార్తా ప్రభ ప్రతినిధి)** మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా మనందరం పనిచేయాలని ప్రముఖ సామాజికవేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సమాజానికి వెన్నెముక వంటి యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) బారిన పడి తమ జీవితాలను, భవిష్యత్తును నాశనం చేసుకోవడం తీవ్ర ఆందోళన కరమని పేర్కొన్నారు.ప్రస్తుత కాలంలో యువతలో డ్రగ్స్ వాడకం పెరగడం అనేది అత్యంత ప్రమాదకరమైనదన్నారు. చిన్నపాటి ఉత్సాహం లేదా స్నేహితుల ఒత్తిడితో మొదలైన ఈ అలవాటు, క్రమంగా ప్రాణాంతక వ్యసనంగా మారి, వ్యక్తిగత జీవితాలను, కుటుంబాలను ఛిద్రం చేస్తోందన్నారు.మాదకద్రవ్యాల వాడకం వల్ల మానసిక స్థిమితం కోల్పోవడం, నాడీ వ్యవస్థ దెబ్బతినడం, అవయవాల వైఫల్యం ప్రాణాంతక వ్యాధుల బారిన పడటం జరుగుతుందని యువత గుర్తించాలని హితవు పలికారు. చదువుపై ఆసక్తి తగ్గడం, ఉద్యోగ అవకాశాలను కోల్పోవడం, ఆర్థిక ఇబ్బందులు, నేర ప్రవృత్తి పెరగడం వంటి తీవ్ర అంశాలు ఇందులో ఉన్నాయన్నారు. యువత ఈ వ్యసనాల్లో చిక్కుకోవడం వల్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్రమైన మానసిక వేదనకు గురవుతున్నారనీ ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. విద్యార్థులు, యువకులు, వారి తల్లిదండ్రులు ఈ దురాచారానికి వ్యతిరేకంగా అవగాహన పెంచుకోవాలన్నారు."డ్రగ్స్ వద్దు – జీవితం ముద్దు" అన్న నినాదంతో మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే మనందరి లక్ష్యం కావాలన్నారు. నేటి యువతే రేపటి భావి భారత నిర్మాతలని, వారిని కాపాడుకోవడం మనందరి సామాజిక బాధ్యత అని ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు.

## జిల్లాలో సజావుగా సర్ ప్రక్రియ..

**- బీఎల్‌వోల ద్వారా 11,88,794 ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజాస్వామ్య వ్యవస్థ స్ఫూర్తికి అనుగుణంగా జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను నిష్పక్షపాతంగా, సజావుగా జరుగుతోందని.. ఇంటింటి సర్వేలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లాలో సుశిక్షితులైన 1,792 మంది బీఎల్‌వోలు ఉన్నారని.. వీరిద్వారా ఇంటింటిని సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తున్నట్లు, నింపిన ఫారాలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 11,88,7 94 (69.38 శాతం) ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం జరిగిందన్నారు. తిరువూరులో 1,76,205 (84.43 శాతం), విజయవాడ పశ్చిమ 1,31,176 (51.05 శాతం), విజయవాడ సెంట్రల్ 1,48,739 (53.54 శాతం), విజయవాడ తూర్పు 1,35,731 (50.32 శాతం), మైలవరం 2,24,230 (78.63 శాతం), నందిగామ 1,88,305 (90.76 శాతం), జగ్గయ్యపేట 1,84,408 (88.85 శాతం) మేర ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు వివరించారు. అదేవిధంగా జిల్లా మొత్తంమీద 1,10,805 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయినట్లు తెలిపారు. బీఎల్‌వోలు, అధికారులు ఈసీఐ నియమనిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాలని, ఎలాంటి ప్రభావాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా నిబద్ధతతో సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. అర్హులను ఓటరు జాబితాలో ఉండేలా చేయడంతోపాటు అనర్హులు, మృతులు, శాశ్వతంగా వలసవెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా లక్ష్యంగా చేపట్టిన ఈ సర్ ప్రక్రియలో ప్రజలు చైతన్యవంతంగా పాల్గొనాలని.. ఎన్యూమరేషన్ ఫారాలను నింపి సంబంధిత బూత్‌స్థాయి అధికారులకు త్వరితగతిన అందజేసి, ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

## తెలుగు అధ్యయనంతో విస్తృత ఉపాధి అవకాశాలు



**విజయవాడ పశ్చిమ జూన్ 25: (వార్తా ప్రభ ప్రతినిధి)** తెలుగు భాషను సాంకేతికతతో అనుసంధానం చేసి అభ్యసిస్తే దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జి. వెంకట్ లాల్ పేర్కొన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన "తెలుగు భాష అధ్యయనం -- ఉపాధి అవకాశాలు" అంశంపై జరిగిన అతిథి ఉపన్యాసంలో ఆయన మాట్లాడారు.గూగుల్, అమెజాన్ వంటి సంస్థలు తెలుగు భాషా నిపుణులను నియమిస్తున్నాయని, డిజిటల్ యుగంలో లాంగ్వేజ్ అనలిస్ట్, కంటెంట్ రైటర్, అనువాదకుడు, మీడియా నిపుణుడు వంటి రంగాల్లో అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. మాతృభాష సమాజ సంస్కృతి, చరిత్రకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థుల్లో మాతృభాష పట్ల అభిరుచి, ఆత్మవిశ్వాసం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ గొడవర్తి నాగరాజు విద్యార్థులు తెలుగు టైపింగ్, డీటీపీ, డిజిటల్ కంటెంట్ తయారీ వంటి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పవన్ కుమార్ రెడ్డి, ప్రఖ్య నాగరేఖ, డాక్టర్ జె.వి. చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

**మరణించిన హోంగార్డు కుటుంబాలకి ఆర్థిక సహాయం అందించిన**

## పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్.







**విజయవాడ పశ్చిమ జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరంలో పనిచేస్తున్న హోంగార్డులలో ఎవరైనా మరణించిన లేక పదవీ విరమణ చేసిన వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా చేయడానికి నగరంలో పనిచేస్తున్న హోంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి వచ్చే వేతనం నుండి సదరు చనిపోయిన హోంగార్డు కుటుంబాలకు లేదా పదవీ విరమణ చేసిన హోంగార్డులకు ఆర్థిక ఆసరా కల్పిస్తున్న విషయం విదితమే. ఈ నేపధ్యంలో విజయవాడ నగర హోంగార్డు యూనిట్ నందు విధులు నిర్వహిస్తూ గత నెలలో వివిధ అనారోగ్య మరియు ప్రమాద కారణాలతో మరణించిన హోంగార్డులు (హెచ్.జి. నెం 213) జె.జనార్ధన్(56 సం.), (హెచ్.జి. నెం 482) డి.కాసయ్య (55 సం.) మరియు (హెచ్.జి. నెం 751) అబ్దుల్ జాని (42 సం.), కుటుంబాలకు ఆర్థిక సహాయంగా ఒకొక్కరికి రూ. 5 లక్షల నగదు చెక్కులను గురువారం తేదీన పోలీస్ కమిషనర్ కార్యాలయం నందు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్ చేతులమీదుగా మరణించిన హోంగార్డు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ తోపాటు అడ్మిన్ డి.సి.పి. శ్రీమతి కె.జి.వి.సరిత ఐ.పి.ఎస్., హోంగార్డు ఆర్.ఐ. కె.సుధాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం కోసం ఎల్‌ఓసిలు అందజేత ..




**విజయవాడ పశ్చిమ జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో ముఖ్యమంత్రి సహాయనిది నుండి మంజూరైన ఎల్ ఓ సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) లను ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి అందజేశారు .. 35 వ డివిజన్ , పేజ్జోని పేటకు చెందిన పొట్టిపాటి వర్ధనమ్మ (45) హృద్రోగం తో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు తెలపడంతో ఎన్డీఏ కార్యాలయంలో వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 10 లక్షల 27 వేల ఎల్ ఓ సీ ను బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.. 47 వ డివిజన్, కుండల బజార్ కు చెందిన కే భరత్ ( 24 ) రోడ్డు ప్రమాదంలో గాయపడి మెరుగైన వైద్యం కోసం ఎన్డీయే కార్యాలయంలో ఎల్ ఓ సీ కొరకు దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 3 లక్షల 50 వేల ఎల్ ఓ సీ ను అందజేశారు.అదేవిధంగా 53 వ డివిజన్,సీతార ప్రాంతానికి చెందిన అంకం రమణ (53) మూత్రపిండాల సమస్యతో బాధపడుతూ వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 3 లక్షల 33 వేల ఎల్ ఓ సీ ను బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు..త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేయడంతో బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుజనా కు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నేతలు దేవిన హరిప్రసాద్, మలపరెడ్డి అప్పారావు, శివరాత్రి శ్రీను, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు..

# రైతు సంక్షేమమే వ్యవసాయ శాఖ లక్ష్యం

**వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జ్యోతి రమణి.**



**మచిలీపట్నం జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రైతు సంక్షేమమే వ్యవసాయ శాఖ లక్ష్యమని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జ్యోతి రమణి అన్నారు. గురువారంమచిలీపట్నం మండలం అరిసేపల్లి ఆర్ ఎస్ కె ఆర్ ఎస్ కె రైతు సేవ కేంద్రం పరిధిలో కృష్ణాజిల్లా జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ జ్యోతిరమణి అసిస్టెంట్ డైరెక్టర్ రమాదేవి,ఏవో రామకుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ పూజిత సిబ్బందితో కలిసి రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ డైరెక్టర్ అనేకమైన రైతు గృహాలను సందర్శిస్తూ రైతన్న మీకోసం అనే కలర్ఫుల్ పాంప్లెట్లను ఇంటింటా పంపిణీ చేశారు. రైతులతో మాట్లాడుతూ సుస్థిర వ్యవసాయం శ్రీరామరక్షగా ఉంటుందన్నారు. రైతు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందన్నారు. వ్యవసాయంలో అభివృద్ధి, సంక్షేమం, ధ్యేయంగా వ్యవసాయ శాఖ నిరంతరం పనిచేస్తుందన్నారు. అన్ని పథకాలకు అర్హత లభించే ఫార్మర్ రిజిస్ట్రేషన్ గూర్చి సవివరంగా తెలియజేశారు. ప్రతి రైతు వ్యవసాయ అసిస్టెంట్ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుంటే విత్తనాలు ఎరువులు పొందటంలో వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ తో పొందడంలో ప్రథమ ప్రాముఖ్యత ఉంటుందన్నారు. ప్రతి 6 లేదా 8 సంవత్సరాలకు ఎదురయ్యే ఎలినినో ప్రభావాన్ని వర్షాభావ పరిస్థితులను సమిష్టిగా కలిసి ఎదుర్కోవాలని తెలియజేశారు. ప్రభుత్వం ఎలాంటి ప్రతికూలమైన పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందన్నారు. తక్కువ నీటితో పండే పంటలపై దృష్టి సారిస్తూ ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల తేమను నిల్వ ఉంచుకోవాలని రైతులతో అన్నారు. యూరియా డి.ఎ.పి మరియు కాంప్లెక్స్ ఎరువులను ప్రతి ఒక్క రైతు ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్స్ అనే యాప్ ద్వారా అందుబాటులో ఉన్న షాపులు లో ఆర్డర్ పెట్టుకొని క్యూఆర్ కోడ్ షాప్ యజమానికి అందించి, ఎరువులు కొనుగోలు చేయాలని తెలియజేసినారు. ఈ సందర్భంగా అనేక మంది రైతులు జాయింట్ డైరెక్టర్ తో ముచ్చటిస్తూ కేంద్ర ప్రభుత్వం ఎరువులు కొనుగోలు చేయుటకు ప్రత్యేకంగా యాప్ తయారు చేయడం ఆనందదాయకంగా ఉందన్నారు. ఈ యాప్ రైతులకు చాలా దోహదకారిగా ఉంటుందన్నారు. రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్న వ్యవసాయ శాఖకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఎత్తిపోతల పథకం నుంచి సాగునీటి విడుదల చేసిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

**నారుమళ్ల అవసరాలకు సాగునీరు అందుబాటులోకి**



**ఇబ్రహీంపట్నం, జూన్ 25(వార్తా ప్రభ ప్రతినిధి):** ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి ఎత్తిపోతల పథకం నుంచి సాగునీటిని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం విడుదల చేశారు.రైతుల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నారుమళ్లకు అవసరమైన నీటిని అందించేందుకు ఈ చర్య చేపట్టినట్లు తెలిపారు. గుంటుపల్లి ఎత్తిపోతల పథకం పరిధిలోని సుమారు రెండు వేల ఎకరాల ఆయకట్టుకు ఈ నీటి విడుదలతో ప్రయోజనం చేకూరనుంది.ప్రస్తుతం వరి సాగు ప్రారంభ దశలో ఉండటంతో నారుమళ్ల పెంపకానికి నీటి కొరత లేకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచించారు. రైతులు సకాలంలో సాగు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.వ్యవసాయ ఉత్పాదకత పెరగడంతో పాటు రైతుల ఆదాయం మెరుగుపడేలా సాగునీటి వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. నీటి వినియోగంలో రైతులు సమన్వయంతో వ్యవహరించి ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, నీటిపారుదల శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అంకితభావంతో విధులు నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.



**మచిలీపట్నం జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కారుణ్య నియామకాల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారు ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అంకితభావంతో విధులు నిర్వహించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కే. బాలాజీ సూచించారు. గురువారం మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నలుగురు అభ్యర్థులకు ఆయన నియామక పత్రాలను అందించారు. అభ్యర్థుల విద్యార్హతలు, అర్హతలను పరిగణనలోకి తీసుకుని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో నియమించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కారుణ్య నియామకాలు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశమని పేర్కొన్నారు. ఉద్యోగంలో చేరిన వారు బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రభుత్వ లక్ష్యాల సాధనకు సహకరించాలన్నారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు తమకు అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## రోగులకు మెరుగైన సేవలే లక్ష్యంగా పని చేయాలి

**-జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**




**మచిలీపట్నం జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో సేవల నాణ్యత పెంపు, పారదర్శక పరిపాలన, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వైద్యులు, వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వహణ, పరిపాలనా విధానాలు, సమస్యలు, రోగులకు అందుతున్న సేవలపై చర్చించారు.సమస్యలను అధికారిక మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని, ప్రతి ఫైలు ఈ-ఆఫీస్ ద్వారానే నిర్వహించాలని, మాన్యువల్ ఫైళ్లకు ఆస్కారం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ రోగులకు ఉత్తమ సేవలు అందించేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొంటే నేరుగా తనను కలిసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, కొనుగోళ్ల ప్రక్రియలో జెమ్ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్స్ ద్వారానే వ్యవహరించాలని సూచించారు. నిబంధనల ఉల్లంఘనను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు.ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది అందరూ ఒక జట్టుగా పనిచేస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కోరారు. ఆసుపత్రి అభివృద్ధి, సిబ్బంది సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి లీల ప్రసాద్, డాక్టర్ జి భానుమూర్తి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బోయిన వెంకట కృష్ణమరాజు, లింగం విజయ్, భూపతి త్రిపుర, విక్కుర్తి సాయిబాబు, ఎండి బాషి, ఇతర వైద్యులు, పరిపాలన విభాగం అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దండి.


**రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలి.!**

**అసిస్టెంట్ కలెక్టర్ నమ్రత అగర్వాల్.**



**మచిలీపట్నం జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పచ్చదనం, పరిశుభ్రతలో భాగంగా అసిస్టెంట్ కలెక్టర్ నమ్రతా అగర్వాల్ పలు ప్రాంతాల్లో పర్యటించి చెత్త ఎక్కువగా రోడ్లమీద వేసే ప్రదేశాలను గుర్తించి, కిందిస్థాయి అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చి, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.నమ్రతా అగర్వాల్ మాట్లాడుతూసచివాలయల సిబ్బంది రోడ్లమీద చెత్త వేసే వారిని గుర్తించి కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు.నగరాన్ని పచ్చదనం, పరిశుభ్రతతో ఉండేలా ప్రజల భాగస్వామ్యంతో అధికారులతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుని చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రతతో ఉండేలా చూసుకోవాలన్నారు.శానిటేషన్ సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు ఆ చెత్తను శానిటేషన్ సిబ్బందికి అందజేసేలా సహకరించాలన్నారు.నగరం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఉండాలన్నారు. శుభ్రతే మన ఆరోగ్యానికి పునాది అన్నారు.నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్, ఎం. గోపాల్ రావు, మున్సిపల్ డి ఈ, కృష్ణ, మున్సిపల్ ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్, ఆకుల మహేశ్వరరావు, 45 డివిజన్ సచివాలయ శానిటేషన్ సెక్రటరీ మానస, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, భాను ప్రసాద్, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

## శేష వాహనంపై దర్శనమిచ్చిన దేవదేవేరులు





**సంగం జూన్ 25 (వార్తప్రభ)** సంగం మండలం అన్నా రెడ్డిపాలెం గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ సీతా లక్ష్మణ సమేత ఆత్మరామ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి అమ్మవార్లు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి అమ్మవార్లను పరిమళ పుష్పాలతో అలంకరించిన శేష వాహనంపై కొలువు తీర్చారు.అనంతరం అర్చకులు హారతి కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం స్వామి అమ్మవార్ల గ్రామ ఉత్సవం వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా దొడ్ల పద్మనాభరెడ్డి దొడ్ల వరద రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఏర్పాట్లను పర్యవేక్షించిన దొడ్ల కుటుంబ సభ్యుడైన దొడ్ల కోదండరామిరెడ్డిని ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్ల ఆశీర్వచనాలు అందించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉభయకర్తలుగా మద్దిశెట్టి వెంకట రమణయ్య జగన్నాథం ఏడుకొండలు కీర్తిశేషులు పాటూరు బుజ్జయ్య సూరా వెంకటేశ్వర్లు భీమ తాటి రాము వేదగిరి భరత్ కుమార్ పగడాల శ్రీహరి వ్యవహరించారు.ఆలయ ఈవో చిల్లకూరు వరప్రసాద్ రెడ్డిబండా హరి కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రంగంపేటలో తెల్లవారుజామునే మద్యం విక్రయాల జోరు

**విద్యార్థినులపై మందుబాబుల అసభ్య ప్రవర్తన.. ఎక్సైజ్ అధికారులు నిద్రలోనా..?**



**చంద్రగిరి, జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి):**చంద్రగిరి మండలం రంగంపేటలో నిబంధనలకు విరుద్ధంగా తెల్లవారుజామునే మద్యం విక్రయాలు జరుగుతున్నాయంటూ గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రంగంపేట వైన్ షాప్ వద్ద ఉదయం 6 గంటలకే మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.రంగంపేట పరిసర ప్రాంతాల్లో పలు విద్యాసంస్థలు, హాస్టళ్లు ఉండటంతో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, విద్యార్థినులు ఈ మార్గంలో కళాశాలలకు వెళ్తుంటారు. అయితే ఉదయాన్నే మద్యం సేవించిన కొందరు మందుబాబులు రోడ్డుపై చిందులు వేస్తూ, అటుగా వెళ్లే విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.వైన్ షాప్ సమయాలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. "ఎక్సైజ్ అధికారులకు ఇవ్వాల్సింది ఇస్తున్నాం" అంటూ కొందరు నిర్వాహకులు బహిరంగంగానే మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి రంగంపేటలో జరుగుతున్న అక్రమ మద్యం విక్రయాలపై విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## స్వయం ఉపాధికి రైజ్ స్టార్!

- విజయవంతంగా శిక్షణ కార్యక్రమాలు
- మహిళల సాధికారతకు వడివడిగా ముందడుగులు
- రైజ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ







**ఇబ్రహీంపట్నం, జూన్ 25 (వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలోని గుంటుపల్లిలోని రైజ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం సందర్శించారు. కేంద్రంలో ప్రారంభమైన హ్యాండ్‌మేడ్ జువెలరీ తయారీ శిక్షణ కార్యక్రమాన్నిపరిశీలించారు. శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి.. వారి అభిరుచులు, లక్ష్యాలను తెలుసుకోవడమే కాకుండా ఉపాధి అవకాశాల గురించి వివరించారు. హరిత అనే మహిళ ఆధ్వర్యంలో 15 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు 15 రోజుల పాటు హ్యాండ్‌మేడ్ జువెలరీ తయారీపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. పూసలు, అలంకరణ వస్తువులతో ఆకర్షణీయమైన ఆభరణాలను తయారు చేసే విధానాలను శిక్షణలో భాగంగా బోధిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ మహిళలకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం ద్వారా వారిని ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లవచ్చని అన్నారు. స్వయం ఉపాధికి దోహదపడే ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా కుటుంబ ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం చేతితో తయారుచేసే ఆభరణాలకు మార్కెట్‌లో డిమాండ్ ఉందని, శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకోవడం లేదా ఆన్‌లైన్ వేదికల ద్వారా తమ ఉత్పత్తులను విక్రయించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. యువత, ముఖ్యంగా మహిళలు తమలోని సృజనాత్మకతను నైపుణ్యంగా మలుచుకుని ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని ఆయన సూచించారు. రైజ్ కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు మహిళల సాధికారతకు బలమైన వేదికగా నిలుస్తున్నాయని కలెక్టర్ లక్ష్మీశ చెప్పారు.కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో సిబ్బందికి అవగాహన



**చేజర్ల జూన్ 25 (వార్తాప్రభ)** చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ నెల 28న 29 మరియు 30 వ తేదీలలో పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందని చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మెహతాబ్ గురువారం తెలిపారు.ఈ కార్యక్రమంలో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాలు గల పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారు గతంలో చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 33 పల్స్ పోలియో కేంద్రాలు ఉండేవి.కానీ ఈ సంవత్సరశీ నుండి 15 కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ప్రజలు ఈ విషయాన్ని గమనించగలరు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలియజేసారు.

## బిజెపి సునీల్ రెడ్డిని కలిసిన శివారెడ్డి



**చేజర్ల జూన్ 25 (వార్తాప్రభ)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ యువమోర్చ అధ్యక్షులు సునీల్ రెడ్డి నెల్లూరు పర్యటన చేయడం జరిగినది.ఈ సందర్భంగా ఆయనను చేజర్ల మండల బీజెపి యువమోర్చ అధ్యక్షులు కుండా శివారెడ్డి కలవడం జరిగింది.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ బలోపేతం దిశగా చేజర్ల మండలంలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఆయనకు వివరించడం జరిగినది.ప్రతి కార్యకర్తకు భారతీయ జనతా పార్టీ పై స్థాయి నుండి కింది స్థాయి వరకు అందరికీ అందుబాటులో ఉండి అండగా ఉంటుందని సునీల్ రెడ్డి భరోసా ఇవ్వడం జరిగింది.

## బురదమయంగా పెద చందాల - లక్ష్మీపురం రోడ్డు



**రోడ్డు వెయ్యాలని ఎమ్మెల్యేకు వేడుకోలు**

**కృత్తివెన్ను, జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృత్తివెన్ను మండలం పెద్ద చందాల- లక్ష్మీపురం ప్రధాన రహదారి వరదమయంగా మారిందని, ఈ రోడ్డులో ప్రయాణించాలంటే నరకప్రాయంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గరిసపూడి వంతెన నిర్మించక ముందు లక్ష్మీపురం వెళ్లడానికి ఈ రెండు గ్రామాలకు ఇదే ప్రధాన రహదారిగా ఉండేదని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఈ రహదారి గుండా వెళ్ళడానికి గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని గ్రామాలలోని రహదారులకు మహాదశ పెట్టిందని, మా గ్రామంలోని రోడ్డును కూడా ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్.



**మచిలీపట్నం జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణా జిల్లా కలెక్టరేట్‌లోని చాంబర్‌లో జిల్లా కలెక్టర్ డి.కే. బాలాజీను కెఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి. నీలకంఠేశ్వరరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.విజయనగరం జిల్లాలో తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన పి. నీలకంఠేశ్వరరెడ్డి ఇటీవల పదోన్నతి పొంది కృష్ణా జిల్లాలో కెఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.కృష్ణా జిల్లాలో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని పి. నీలకంఠేశ్వరరెడ్డి తెలిపారు.

# విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలి

**-జెనెసిస్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ జైపాల్**






**శేరిలింగంపల్లి,జూన్ 25 (వార్తాప్రభ):**మదీనాగూడలోని జెనెసిస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం ఇన్వెస్టిచర్ సెరిమనీ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లెఫ్టినెంట్ కల్నల్ అరవింద్ కుమార్ రెడ్డి,కమాండింగ్ ఆఫీసర్, 1(టీ) ఆర్టిలరీ బ్యాటరీ,తెలంగాణ ఎన్‌సీసీ హాజరయ్యారు.విశిష్ట అతిథులుగా అరుణ్ కుమార్, నందిత ప్రకాష్,పాఠశాల వ్యవస్థాపకులు,చైర్మన్ జైపాల్, డైరెక్టర్లు అనన్య,అవినాష్, ప్రిన్సిపాల్ నళిని పాల్గొన్నారు.ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు.ఇన్వెస్టిచర్ సెరిమనీ విద్యార్థుల్లో బాధ్యతాయుత నాయకత్వాన్ని పెంపొందించే వేదికగా నిలుస్తుందన్నారు.ఎన్నికైన విద్యార్థి నాయకులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచాలని ఆకాంక్షించారు.అనంతరం నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు, సాష్‌లను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన ఎస్.ఎం. రాజీవ్, సి/ఓ గీతా జోసెఫ్, 7(టీ) గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ తెలంగాణ, 2/ఓ రవికుమార్, 1(టీ) ఆర్టిలరీ బ్యాటరీ ఎన్‌సీసీ హైదరాబాద్ గ్రూప్ సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్.యు.బి. సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

**- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్**



**మల్కాజిగిరి :జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వినాయక్ నగర్ డివిజన్ పరిధిలో ప్రతిపాదించిన ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణంపై స్థానిక కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌యూబీ నిర్మాణం కోసం అధికారులు మార్కింగ్ చేయడంతో పలు ఇళ్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌యూబీ నిర్మాణం జరిగితే ఇప్పటికే ఇరుకుగా ఉన్న కాలనీ రోడ్లు మరింత ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని స్థానికులు తెలిపారు. గోడలు నిర్మిస్తే అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సమస్యను కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా ఆమె వెంటనే స్పందించి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అపాయింట్‌మెంట్ తీసుకుని బాధితులను ఆయన వద్దకు తీసుకెళ్లారు. కాలనీవాసుల సమస్యలను విన్న ఎంపీ ఈటల రాజేందర్ వెంటనే స్పందించారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, సంబంధిత డీజీఎం అధికారులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మహేశ్వరి, వీరేశం, సుధాకర్, శ్రీనివాస గుప్తా, శ్రీధర్ బాబు, రాణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి




**విజయవాడ పశ్చిమ జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో పశ్చిమలోని విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఏఈ లు కూటమి నేతలతో కలసి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ భవానిపురం ఎన్డీయే కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.. ఈ సందర్భంగా కూటమి నేతలు, సుజనా మిత్రా కోఆర్డినేటర్ల తో చర్చించి ఎఈ లు విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు..పలు ప్రాంతాలలో ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, వీధిలైట్ల సమస్యలు, నూతనంగా ఏర్పాటు చేయవలసిన వీధిలైట్లు, విద్యుత్ స్తంభాల వివరాలను కూటమి నేతలు, సుజనా మిత్రాలు ఎ ఈ ల దృష్టికి తీసుకెళ్లారు.. సమస్యలను సావధానంగా విన్న ఎ ఈ లు ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు..ఎ ఈ లు సతీష్ కుమార్, జయంత్ కళ్యాణ్, రాంప్రసాద్, జానీ భాష, వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు బుల్లా విజయ్ కుమార్, నాగోతి రామారావు,ఎన్టీఆర్ జిల్లా బీజేపీ వైస్ ప్రెసిడెంట్ నున్న కృష్ణ, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ వాణిజ్య విభాగం కన్వీనర్ పచ్చిపులుసు వెంకట శివప్రసాద్ , బీజేపీ మండల అధ్యక్షులు పగడాల కృష్ణ, దేవిన హరిప్రసాద్, బీజేపీ నేతలు బెన్నా భక్తుల సోమేశ్వరరావు, పోలవరపు దుర్గారావు, రామకృష్ణ, హరీష్ వ్యాస్, విస్సం శెట్టి శ్రీనివాస్, అడ్డూరి భాస్కరరావు కూటమి నేతలు పీవీ చిన సుబ్బయ్య, బొడ్డుపల్లి శ్రీనివాసరావు, చిన బాబు, కూర్మారావు,బొమ్ము రాంబాబు, తమ్మిన లీల తదితరులు పాల్గొన్నారు...

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం!!

- యువత మేల్కొనండి... డ్రగ్స్ తరిమికొట్టండి
- విద్యార్థుల ప్రతిజ్ఞ, పోలీస్ సిబ్బంది మద్దతు
- తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా పెట్టాలి
- 2టౌన్ ఎస్.హెచ్.ఓ. ఎన్. ప్రసాదరావు




**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 25 (వార్తాప్రభ ప్రతినిధి)**యాంటీ డ్రగ్స్ వీక్ సందర్భంగా గోదావరిఖని టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఎన్. ప్రసాదరావు ఆధ్వర్యంలో 8 ఇంక్లైన్ కాలనీలోని తెలంగాణ చౌరస్తాలో గురువారం ఒక వినూత్న చైతన్య కార్యక్రమం జరిగింది. స్థానిక స్పందన హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులతో కలిసి నిర్వహించిన ఈ భారీ మానవహారం సమాజానికి ఒక బలమైన సందేశాన్ని ఇచ్చింది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ, నేటి యువత తెలియకుండానే సిగరెట్ స్మోకింగ్, గంజాయి వంటి ప్రాణాంతక మత్తు పదార్థాల బారిన పడి తమ విలువైన భవిష్యత్తును చీకట్లోకి నెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "యువత మేల్కొనండి... డ్రగ్స్ను తరిమికొట్టండి" అంటూ ఆయన ఇచ్చిన పిలుపు అక్కడ చేరిన ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. ముఖ్యంగా, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై, వారి తిరుగులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, చెడు మార్గాల వైపు వెళ్లకుండా వారిని సన్మార్గంలో ప్రోత్సహించాల్సిన బాధ్యత కుటుంబాలపైనే ఉందనే నిజాన్ని ఆయన చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో సంకల్పించిన ఈ మహా యజ్ఞంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని, మహమ్మారిలా మారుతున్న మాదకద్రవ్యాలను వేళ్లతో సహా నిర్మూలించాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే పాఠశాల విద్యార్థులందరితో డ్రగ్స్ నిరోధక ప్రతిజ్ఞ చేయించి, వారిలో సామాజిక బాధ్యతను నింపారు. సమాజంలో ఎక్కడైనా ఎవరైనా డ్రగ్స్ సేవించినా లేదా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే, వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా కంట్రోల్ రూమ్ నెంబర్ 8712671111 కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న వ్యసనాలపై సమరం ప్రకటించిన ఈ చైతన్యవంతమైన కార్యక్రమంలో గోదావరిఖని టూ టౌన్ పోలీస్ సిబ్బంది సిహెచ్. రాజయ్య, విశ్వనాథ్, ప్రదీప్ రెడ్డి, అఫ్రోజ్, దేవేందర్ రావు, విజయమణిలతో పాటు స్పందన స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.

# బీసీల సమస్యలకు పరిష్కారం చూపాలి : బేరి రామచందర్ యాదవ్

***బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావుకి వినతి పత్రం అందించిన బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్***



**హైదరాబాద్ :జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలంగాణలోని బీసీ కులాల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ కోరారు. బీసీల డిమాండ్ల కోసం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావుకి శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టింగ్ అభ్యర్థి మారబోయిన రవి కుమార్ యాదవ్ కి ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్ సమక్షంలో ఓబీసీ సమస్యల గురించి వినతి పత్రం సమర్పించారు. బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, బీసీ నాయకులు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రగుండ్ల ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో మియాపూర్ ఓబీసీ మోర్చా సమావేశం మదినగూడ భూమి బ్యాంకెట్ హాల్లో నిర్వహించారు. ముఖ్యంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉన్నందున 54 శాతం ఉన్న బీసీలకు న్యాయం చేయాలని పేద వర్గాలైన 132 బీసీ కులాలకు అన్ని విధాల సహాయ పడాలని విన్నవిస్తూ మెమొరాండం అందజేశారు.బీసీ కులాల్లో ఎక్కువగా పేదలు ఉన్నందున విద్యా, వైద్యంలాంటి అధిక ఖర్చులు భరించలేని పక్షంలో ఉన్న పేదలకు కేంద్ర ప్రభుత్వం కూడా బాధ్యత తీసుకొని విద్య కోసం ఎక్కువ బడ్జెట్ కేటాయించాలని కోరారు.పేదల కోసం ముద్ర లోన్లు, సబ్సిడీ లోన్స్ మిగతా అన్ని సంక్షేమ పథకాలను తూచా తప్పకుండా అన్ని బీసీ కుల సంఘాలకు వర్తించే విధంగా వృత్తి ధర్మంగా 132 కులాలకు సహాయం చేయాలని కోరారు రైతుల్లో 50 శాతం కంటే ఎక్కువ ఉన్న బీసీలు చాలామంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. బ్యాంకు లోన్ ఇవ్వనందున ఎంతో మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులకు సబ్సిడీ ఎరువులు సబ్సిడీ విత్తనాలు అవన్నీ కూడా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రైతులకు సహాయపడాలని విన్నవించారు. ప్రజాస్వామ్యంలో చేతినిండా పని, కడుపునిండా అన్నం ఉండాల్సిందే. గ్రామీణ ప్రాంతాల్లో రోజుగార్ యోజన గ్రామీణ సడక్ యోజన ఎన్ని యోజనాలు ఉన్నా కూడా పేదరికానికి తొలగించే విధంగా ప్రభుత్వాలు ఇంతవరకు ప్రయత్నం చేయలేదన్నారు. బీసీ కులాల బిసి సంఘాల ప్రధాన కార్యదర్శులు అధ్యక్షులు, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ విజ్ఞప్తితో వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బేరి రామచంద్ర యాదవ్ తో పాటు ఆర్కే సాయన్న ముదిరాజ్ మేదరి సంఘం అధ్యక్షులు కొంటు ముకుందం బట్రాజు సంఘం అధ్యక్షులు రాజు విశ్వబ్రాహ్మణ సంఘం శేరిలింగంపల్లి శ్రీశైలం కురుమ, సాయిలు విశ్వకర్మ సంఘం హరికృష్ణ చారి ఐక్యవేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి కోటగిరి మారుతి అధ్యక్షులు కృష్ణమోహన్ యువత అధ్యక్షులు కొంటూ సుమన్ ఆంజనేయులు గౌడ సంఘం రామకృష్ణ గౌడ్ మున్నూరు కాపు సంఘం బి కృష్ణ నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సాయిలు, ముత్యం ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కిర్లంపూడిలోఘనంగా మహా చండీ హోమం





**కిర్లంపూడి జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి లో కొత్తా వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా మహా చండీ హోమం నిర్వహించారు. పెద్దాపురం భువనేశ్వరి పీఠాధిపతులు గోపి శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో వారి బృందం ఐదు రోజులపాటు మహా చండి హోమ కార్యక్రమం నిర్వహించారు. కొత్త సత్య సుబ్బారావు (బాబ్జి) యశోద, పిడికిటి దుర్గా అన్నపూర్ణ రమేష్,కొత్త వీరబాబు గంగాభవాని, తాటికొండ రాజా అవినాష్ బిందు కోమలి (బంగారం) దంపతులు పీటలపై ఆసీనులై అత్యంత భక్తి శ్రద్ధలతో హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతినిత్యం గణపతి పూజతో ప్రారంభించి ప్రధాన మండపారాధన, ఉప మండపారాధన, రుత్విక్ వరుణలు, పుణ్యాహవచన,చండీ పారాయణ, చండీ జపం, సాయంత్రం మహిళలచే సామూహిక శ్రీలలితా సహస్రనామ పారాయణ, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ, శ్రీదేవి ఖడ్గమాలా స్తోత్రం, లింగాష్టకం, మణిద్వీప వర్ణన, సౌందర్యలహరి, సహస్ర కుంకుమార్చన వంటి కార్యక్రమములు ఐదు రోజులపాటు నిర్వహించారు. చివరి రోజున పూర్ణాహుతి నిర్వహించి తీర్థ ప్రసాద వితరణ, అన్న సమారాధనతో పాటు మహిళలకు పసుపు కుంకుమలు అందజేశారు. ఈ సందర్భంగా కొత్తా సత్య సుబ్బారావు యశోద దంపతులు మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ తమ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్త అయ్యిలు, ఆడారి సోమేశ్వరరావు, డివిఆర్ సూరిబాబు, యార్లగడ్డ రాధా గోపాలకృష్ణ వెన్నపు గంగాధర్, నున్న లక్ష్మణరావు, శరకణం గణేశ్వరరావు, దాడి వెంకటేశ్వరరావు, దొడ్డి రామకృష్ణ, గండి సత్యనారాయణ, కుర్ల బుల్లి రాజు, మామిళ్ళపల్లి వెంకటేశ్వరరావు, శ్రీకృష్ణ, శనక్కాయల మహాలక్ష్మి, పంతం రామలక్ష్మి,కొత్త వెంకటేశ్వరరావు, కొత్తలక్ష్మీ, కొత్త వీర్రాజు కొత్త జ్యోతి, కొత్త రామ సుబ్బారావు, కొత్తరాజేశ్వరి, కొత్త శ్రీనివాస్,ఏలూరు శ్రీను తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దేదీప్యమానంగా ముగిసిన శ్రీ వేంకటేశ్వరుని వార్షికోత్సవాలు....



**గుడ్లవల్లేరు: జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలంలోని డోకిపర్రు మహా క్షేత్రంలోని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) సంస్థ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన 11వ వార్షికోత్సవ వేడుకలు దేదీప్యమానంగా ముగిశాయి. వసంతోత్సవం, బంగ్లా ఉత్సవం నిర్వహించడంతో పాటు గరుడ వాహనంపై తిరుమాడ వీధి సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. అడుగడుగునా మహిళా భక్తులు స్వామివార్లకు హారతులు ఇచ్చి బ్రహ్మరథం పట్టారు. దేవస్థాన నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ, పామిరెడ్డి ప్రసన్న పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి.. యువతే సమాజానికి మార్గదర్శి

**సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మాదకద్రవ్యాల అవగాహన కార్యక్రమం**

**విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపు**



**విజయవాడ, జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**యువత మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలని సహాయ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.వి. రామశివ సూచించారు.మొగల్రాజపురం లోని సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆర్.వి. రామశివ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని చెప్పారు. విద్యార్థులు చెడు స్నేహాలు, అనారోగ్యకరమైన అలవాట్లకు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని సూచించారు.మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలపై విద్యార్థులకు వివరించారు. సమాజంలో మత్తు పదార్థాల నిర్మూలనకు యువతే కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం

**-ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి,జూన్ 25 (వార్తాప్రభ):**ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.43,07,500 ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను 58 మంది బాధిత కుటుంబాలకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో అత్యవసర వైద్య చికిత్సల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ ఆర్థిక సాయం మంజూరైంది.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరమని అన్నారు.ప్రజాక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతిగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయ నిధి ఆపన్నహస్తంగా నిలుస్తోందని, అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే నిరుపేదలకు ఇది ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు.వైద్య చికిత్సల కోసం ఆర్థిక సహాయం అందించడంలో కృషి చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజ్, నాయకులు సంజీవ్ రెడ్డి, రఘునందన్ రెడ్డి,నాయినేని చంద్రకాంత్ రావు,ఎండీ ఇబ్రహీం,మంత్రి ప్రగడ సత్యనారాయణ,చిరుమర్తి రాజు, మల్లయ్య,గోపాల్, తిరుపతి,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 28న,కవి సోమన్న "ప్రసన్న వదనం" పుస్తకావిష్కరణ




**కర్నూలు, జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నందవరం మండల పరిధిలోని జడ్పీహెచ్ స్కూల్ నాగలదిన్నెలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు గద్వాల సోమన్న 99వ పుస్తకం "ప్రసన్న వదనం" పుస్తకావిష్కరణ శంకర మఠం, కర్నూలులో జూన్ 28 న జరగనుంది.సాహితీ సదస్సు -కర్నూలు వారి ఆధ్వర్యంలో,సరస్వతీ పుత్ర పుట్టపర్తి నారాయణాచార్యుల వారి 112వ జయంతి ఉత్సవాల సందర్భంగా ముఖ్య అతిథులు కళారత్న చంద్రశేఖర్ కల్కూర, జె. యస్. ఆర్. కె. శర్మ,డా. దండెబోయిన పార్వతి,వ్యాఖ్యాత ఆకాశవాణి కండె సునీత మరియు విచ్చేసిన పుర ప్రముఖుల చేతుల మీదగా ఆవిష్కరిస్తారని బహు గ్రంథకర్త గద్వాల సోమన్న ఓ ప్రకటనలో తెలిపారు..

# ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియపై బూత్ లెవెల్ అధికారులకు అవగాహన



**జి.కొండూరు: జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**82-మైలవరం నియోజకవర్గ పరిధిలో నిర్వహించబడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్ )-2026 కార్యక్రమములో భాగంగా జి.కొండూరు తహశీల్దారు కార్యాలయంలో గురువారం బూత్ లెవెల్ అధికారులు (బీూా లు), సూపర్‌వైజర్లతో 82-మైలవరం నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల శాఖ అధికారి టి.సతీష్ స్థానిక తహశీల్దార్ ఆర్.రాణి తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జి.కొండూరు మండల పరిధిలో ఇంటింటికి ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారముల పంపిణీ కార్యక్రమము పురోగతి, సేకరించిన ఎన్యూమరేషన్ ఫారముల వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేయు ప్రక్రియ, అలాగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం అమలు తీరును ప్రగతి నివేదికల ఆధారంగా సమీక్షించారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా,సమర్థవంతంగా పూర్తి చేయుట కు అవసరమైన చర్యలు చేపట్టవ లసిందిగా సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి గ్రామానికి సమృద్ధిగా సాగునీరు త్రాగునీరు ఇవ్వడమే లక్ష్యం

**-ఎం.ఎల్.ఎ కృష్ణ ప్రసాద్**



**కృత్తివెన్ను జూన్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పెడన నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగునీరు త్రాగునీరు అందించడమే లక్ష్యమని పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. గురువారం బంటుమిల్లి డిసి పరిధిలోని, జయపురం నుండి రామవరపు మోడీ ప్రధాన కాలువ మరమ్మత్తు పనులను కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాలకు మహర్దశ వచ్చిందని, గ్రామాలలోని మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు రైతులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

# కేడీసీసీ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి -ఎమ్మెల్యే కృష్ణప్రసాదు

● కేడీసీసీబీ ద్వారా జిల్లాలో రూ.12,596.92 కోట్లు రుణాలు పంపిణీ చేయడం జరిగింది -కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం ● మైలవరంలో రూ.21.31 కోట్ల రుణాల పంపిణీ చేసిన నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే కృష్ణప్రసాదు





**మైలవరం,జూన్ 25 (వార్తాప్రభ) :** కేడీసీసీ బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. మైలవరంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన రుణాల పంపిణి కార్యక్రమంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కెడీసీసీబీ) చైర్మన్ నెట్టెం రఘురాం తో కలిసి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు రైతులు, డ్వాక్రా మహిళలకు రుణాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు, మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.రైతులకు ఖరీఫ్ సీజన్లో పంట రుణాలు అందించడం ద్వారా వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.మొత్తం రూ.21.31 కోట్ల రుణాలు పంపిణీ చేయగా, అందులో మైలవరం బ్రాంచ్‌కు రూ.11.93 కోట్లు, జి.కొండూరు బ్రాంచ్‌కు రూ.4.51 కోట్లు, ఇబ్రహీంపట్నం బ్రాంచ్‌కు రూ.3.50 కోట్లు, కొత్తూరు తాడేపల్లి బ్రాంచ్‌కు రూ.0.62 కోట్లు, భవానిపురం బ్రాంచ్‌కు రూ.0.75 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రైతులు సకాలంలో రుణాలను వినియోగించి వ్యవసాయోత్పత్తిని పెంచుకోవాలని, మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించుకొని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని సూచిం చారు.మైలవరం నియోజకవర్గ పరిధిలోని 5 బ్రాంచ్ ల ద్వారా మొత్తం 28 సొసైటీలకు రుణాలు మంజూరు చేశారు.ఇబ్రహీంపట్నం బ్రాంచ్‌లో రూ.100.39 కోట్ల డిపాజిట్లు, మైలవరం బ్రాంచ్‌లో రూ.85.62 కోట్లు, జి.కొండూరు బ్రాంచ్‌లో రూ.67.52 కోట్లు, భవానీపురం బ్రాంచ్‌లో రూ.50.96 కోట్లు డిపాజిట్లు, కొత్తూరు తాడేపల్లి బ్రాంచ్‌లో రూ.15.10 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని తెలిపారు.అలాగే మైలవరం నియోజకవర్గంలోని ఐదు ప్రధాన బ్రాంచీల ద్వారా మొత్తం రూ.723.25 కోట్ల రుణాలు పంపిణీ చేయడం జరిగిందనీ, ఇందులో మైలవరం బ్రాంచ్ రూ.249.04 కోట్ల రుణాలు, జి.కొండూరు బ్రాంచ్ రూ.236.14 కోట్లు, ఇబ్రహీంపట్నం బ్రాంచ్ ద్వారా రూ.156.16 కోట్లు, కొత్తూరు తాడేపల్లి బ్రాంచ్ ద్వారా రూ.46.96 కోట్లు, భవానిపురం బ్రాంచ్ ద్వారా రూ.34.95 కోట్ల రుణాలు పంపిణీ చేశారు.

**కేడీసీసీబీ ద్వారా జిల్లాలో రూ.12,596.92 కోట్లు రుణాలు పంపిణీ చేయడం జరిగింది -కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం**

మే 31, 20w26 నాటికి కేడీసీసీబీ ద్వారా జిల్లాలో మొత్తం రూ.12,596.92 కోట్లు రుణాలు పంపిణీ చేసినట్లు కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం వెల్లడించారు.అందులో డిపాజిట్లు రూ.3,981.13 కోట్లు కాగా, రూ.8,615.78 లక్షల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు సహకార శాఖ అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, రైతులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# వైసీపీ కాపుల సమావేశానికి స్పష్టమైన ఎజెండా లేదు

● కాపులకు నాడు దామోదరం సంజీవయ్య, నేడు చంద్రబాబు ద్వారానే మేలు ● వైసీపీ నేతలు సమాధానం చెప్పాలి ● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు జ్యోతుల నెహ్రూ



**కాకినాడ,జూన్ 25 (వార్తాప్రభ) :** కాపు సామాజిక వర్గం అభ్యున్నతి, సంక్షేమం, విద్యా--ఉపాధి అవకాశాల పెంపు వంటి కీలక అంశాలపై చర్చించాల్సిన సమావేశాన్ని వైసీపీ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జగ్గం పేట ఎమ్మెల్యే జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ) విమర్శించారు. వైసీపీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కాపు సమావేశంలో కాపుల అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణ, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక, ప్రభుత్వంపై ఉంచాల్సిన డిమాండ్లు వంటి అంశాలపై ఎలాంటి చర్చ జరగలేదని ఆయన పేర్కొన్నారు. గురువారం కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ కాపు సమాజానికి నిజమైన మేలు జరిగిన సందర్భాలను పరిశీలిస్తే నాటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య హయాంలోనూ, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనూ మాత్రమే స్పష్టమైన చర్యలు కనిపించాయని అన్నారు. కాపుల అభివృద్ధి పేరుతో రాజకీయాలు చేయడం కాకుండా వారి భవిష్యత్తుకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవడం అవసరమని సూచించారు. కాపులకు బీసీ రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ నేపథ్యంలో రాజ్యాంగపరమైన, న్యాయపరమైన పరిమితులను దృష్టిలో ఉంచుకుని టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని నెహ్రూ గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ అమలులో ఇబ్బందులు తలెత్తడంతో కాపులను ప్రత్యేక కేటగిరీలో చేర్చుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కల్పించిన 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లో కాపులకు గణనీయమైన ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కాపులకు సంబంధించి గతంలో ప్రారంభించిన కార్యక్రమాలను కొనసాగించడంలో ఆసక్తి చూపలేదని విమర్శించారు. కాపు రిజర్వేషన్లు, కాపు సంక్షేమ పథకాల అమలు, కార్పొరేషన్ బలోపేతం వంటి అంశాలపై వైసీపీ కాపు నాయకులు తమ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించలేదని జ్యోతుల నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు మౌనం పాటించి, ఇప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ కాపు సామాజిక వర్గీయులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సమంజసం కాదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కాపు సమాజానికి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చామని నెహ్రూ వివరించారు. కాకినాడలో కాపు కళ్యాణ మండపం నిర్మాణం, జగ్గంపేటలో కాపు భవనం ఏర్పాటు వంటి పనులు టీడీపీ పాలనలోనే జరిగాయని చెప్పారు. గోకవరంలో కాపు భవనం నిర్మాణానికి కూడా చర్యలు ప్రారంభించినప్పటికీ ప్రభుత్వం మారడంతో ఆ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని, కాపు కార్పొరేషన్‌తో పాటు ఇతర సామాజిక వర్గాల కార్పొరేషన్లకు కూడా త్వరలోనే తగిన నిధులు విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. సంక్షేమంతో పాటు ఉపాధి, విద్య, స్వయం ఉపాధి రంగాల్లో అవకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని పేర్కొన్నారు. కాపు సమాజం పేరుతో రాజకీయ సభలు నిర్వహించడం కంటే వారి సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపడం ముఖ్యమని నెహ్రూ అన్నారు. సమాజ అభివృద్ధికి అవసరమైన సూచనలు, ప్రతిపాదనలు ఇవ్వకుండా కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమవడం దురదృష్టకరమని నెహ్రూ వ్యాఖ్యానించారు. ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు పెంకే శ్రీనివాస్ బాబా, సుంకర పావని, రామదేవు సీతయ్యదొర, ఉండవల్లి వీర్రాజు, గుండు శ్రీనివాస రావు, దేవు వెంకన్న, బోళ్ళ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అస్థవ్యస్థ పనులతో త్రాగునీటి సమస్యలు జటిలం

● ఈసారి ప్రణాళికతో సవ్యంగా చేయాలి ● గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి ● గ్రామ అభివృద్ధి ప్రణాళిక బాధ్యతగా రూపొందించాలి ● డీ.ఆర్.డీ.ఏ శాఖ తీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి ● కోడూరు ప్రజా దర్బారులో 51అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే



**కోడూరు, జూన్ 25 (వార్తాప్రభ) :** గత ప్రభుత్వంలో అస్థవ్యస్థ జల జీవన్ మిషన్ పనులతో గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు పరిష్కారం కాకపోగా మరింత జటిలంగా మారాయని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం కోడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 51 అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించారు. అధికారులతో చర్చించి పరిష్కారాలు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ పనులు సక్రమంగా చేయకపోవడంతో త్రాగునీటి సమస్యలు ఎక్కడికక్కడ ఉన్నాయన్నారు. పలు గ్రామాల్లో త్రాగునీటి వనరులు చూడకుండా, ట్యాంకులు నిర్మించకుండా పైప్ లైన్లు ఏర్పాటు చేసి కుళాయిలు వేశారన్నారు. ఈసారి వచ్చే జల జీవన్ మిషన్ నిధులతో పనులు సక్రమంగా గుర్తించి ప్రణాళిక ప్రకారం పని చేయాలని సూచించారు. మైక్రో ఫిల్టర్లు సమకూర్చేందుకు ఎంపీ బాలశౌరి సుముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో మైక్రో ఫిల్టర్లు అవసరమైన గ్రామాల జాబితా రూపొందించాలని సూచించారు. గ్రామ ప్రత్యేక అధికారులుగా బాధ్యత చేపట్టిన ప్రతి ఒక్కరూ గ్రామపంచాయతీ కార్యదర్శులతో కలసి సమర్థవంతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు పంచాయతీ కార్యదర్శులతో కలిసి పని చేసి, గ్రామాల్లో ఎలాంటి త్రాగునీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. మందపాకల శివారు చింతకోళ్ల, లింగారెడ్డిపాలెం శివారు గుడుమోటుతో పాటు కోడూరులోని పలు ప్రాంతాల్లో త్రాగునీటి ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయని, అధికారులు సమర్థవంతంగా పనిచేసి ఆయా సమస్యలు పరిష్కరించాలని స్పష్టం చేశారు. చింతకోళ్ల గ్రామాన్ని తాను సందర్శించి ఇప్పటికే ట్యాంకరుతో త్రాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి కాలువల ద్వారా త్రాగునీరు విడుదల అవుతున్న నేపథ్యంలో అన్ని పంచాయతీ త్రాగునీటి చెరువులు నూరు శాతం నింపాలని స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధి ప్రణాళికను రూపొందించే అధికారులు ప్రతిపాదనలు సవ్యంగా రూపొందించాలని స్పష్టం చేశారు. గుడుమోటులో తాను కాలి నడకన తిరిగి నిర్మించవలసిన రోడ్లను గుర్తించి అధికారులకు సూచిస్తే ప్రణాళికలో పొందుపర్చక పోవటం గమనించి అధికారులకు చురకలు వేశారు. అధికారులు బాధ్యతగా పని చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. తారురోడ్ల ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు. గ్రామ ప్రత్యేక అధికారులు సక్రమంగా పని చేయకపోతే, వేరే వారిని నియమిస్తామన్నారు. హంసలదీవి డ్వాక్రా మహిళల సొమ్ము రూ.పది లక్షల మేరకు దుర్వినియోగం జరిగిన వ్యవహారం పరిష్కారంలో జిల్లా అధికారుల తీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. డ్వాక్రా మహిళల సొమ్ము దుర్వినియోగం చేసిన వాళ్ళు ఎంతటివారైనా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, డీ.ఆర్.డీ.ఏ. అధికారులు విచారణ చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ జిల్లా అధికారులు ఈ సమస్య పరిష్కరించాలని స్పష్టం చేశారు.

**మంగళగిరిని దాటే ప్రయత్నం చేయండి..** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచే క్రమంలో కోడూరు మండలం రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందని ఎంఈఓలు టీవీఎం రాందాస్, కమ్మిలి నాంచారయ్య తెలిపారు. మంగళగిరి మొదటి స్థానంలో ఉందని ఎంఈఓలు చెప్పగా, మరి కొంత శ్రద్ధ వహించి మొదటి స్థానంలో నిలిచేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, తహసీల్దార్ కేవీ పూర్ణచంద్రరావు, ఎంపీడీఓ కే.సుధాప్రవీణ్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 45 మందికి రూ.32.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

● అనారోగ్య బాధితులకు ఆర్థిక భరోసాగా సీఎం సహాయ నిధి ● రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం,జూన్ 25 (వార్తాప్రభ) :** రామచంద్రపురం నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 45 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.32.2 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్,కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, ముఖ్యంగా ఆరోగ్య పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కష్టకాలంలో ఆదుకునే ఆపన్నహస్తమని పేర్కొన్నారు.అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం గొప్ప భరోసానిచ్చే చర్యగా మంత్రి సుభాష్ అభివర్ణించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి అందేలా కృషి కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, కూటమి పార్టీ నాయకులు, లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సైన్స్ వేదికపై మెరవనున్న కాకినాడ విద్యార్థిని అనుష్కకు డీఈఓ శుభాకాంక్షలు



**కాకినాడ,జూన్ 25 (వార్తాప్రభ) :** జపాన్ రాజధాని టోక్యోలో ఈ నెల 28వ తేదీ నుంచి జూలై 4వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక సకురా సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో పాల్గొనేందుకు ఎంపికైన కాకినాడకు చెందిన ప్రతిభావంతురాలు, మదర్ థెరిస్సా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని, ప్రస్తుతం నగరంలో ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్న గుత్తుల అనుష్కను జిల్లా విద్యాశాఖాధికారి పి. రమేష్ గురువారం తన కార్యాలయంలో ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా డీఈఓ పి. రమేష్ మాట్లాడుతూ అనుష్క సాధించిన విజయం జిల్లా విద్యార్థులలో దాగి ఉన్న శాస్త్రీయ ప్రతిభకు అద్దం పడుతోందన్నారు. అంతర్జాతీయ వేదికపై కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరియు దేశానికి గుర్తింపు తీసుకురావడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. జపాన్‌లోని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో జరుగుతున్న ఆధునిక పరిశోధనలు, ఆవిష్కరణలను పరిశీలించి వాటి అనుభవాలను స్వదేశంలో విద్యా, శాస్త్రాభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు.అనుష్క రూపొందించిన మల్టీ పర్పస్ అగ్రికల్చరల్ టూల్ ఫర్ స్మాల్ స్కేల్ ఫార్మర్స్ ప్రాజెక్టు ఇన్‌స్పైర్ మానక్ 2022-23 నందు జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఉత్తమ ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచి, జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ నిర్వహిస్తున్న సకురా సైన్స్ కార్యక్రమానికి ఎంపిక కావడం ఆమె కృషి,సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథానికి నిదర్శనమని కొనియాడారు.చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే వినూత్న వ్యవసాయ పరికరాన్ని రూపకల్పన చేసి అంతర్జాతీయ గుర్తింపు పొందిన అనుష్క భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆమె జపాన్ పర్యటన విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు.ఈ ప్రాజెక్టుకు మార్గదర్శక ఉపాధ్యాయునిగా వ్యవహరించిన కె.ఆర్.ఎస్.చంద్రరెడ్డిని డీఈఓ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సృజనాత్మకత పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కె.ఆర్.ఎస్.చంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి ఉత్తర్వులు--2025 అమలు నేపథ్యంలో.... ఉపాధ్యాయుల పని సర్దుబాటుపై పునరాలోచన అవసరం

● ముందుగా కేడర్ కేటాయింపులు పూర్తి చేసి, అనంతరం సమగ్ర పని సర్దుబాట్లు చేపట్టాలి - నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**విజయవాడ,జూన్ 25 (వార్తాప్రభ) :** రాష్ట్రపతి ఉత్తర్వులు--2025 అమలు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా, జోన్, మల్టీ జోన్ స్థాయిలలో ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియను ప్రారంభించిన తరుణంలో, ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను కూడా సమాంతరంగా చేపట్టడం పట్ల నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి లు కరణం హరికృష్ణ మరియు మాగంటి శ్రీనివాస రావు లు ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుతం చేపడుతున్న పని సర్దుబాట్లు ప్రస్తుతం ఉన్న జిల్లా, డివిజన్ పరిమితులను ఆధారంగా చేసుకుని జరుగుతున్నాయి. అయితే అధ్యక్ష ఉత్తర్వులు--2025 అమలుతో ఉద్యోగుల కేడర్ కేటాయింపులు పూర్తైన తర్వాత జిల్లా వారీగా ఉపాధ్యాయుల సంఖ్య, మిగులు-కొరత పరిస్థితులు మారే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ముందుగానే భారీ స్థాయిలో పని సర్దుబాట్లు చేపట్టడం వల్ల ఉపాధ్యాయులు తక్కువ వ్యవధిలో ఒకటి కంటే ఎక్కువసార్లు స్థానచలనం చెందాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని సంఘం నాయకులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి పరిస్థితులు ఉపాధ్యాయుల వ్యక్తిగత, కుటుంబ మరియు వృత్తిపరమైన అంశాలపై ప్రభావం చూపడమే కాకుండా, పాఠశాలల విద్యా ప్రణాళికలపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అంతేకాకుండా, కేడర్ కేటాయింపుల అనంతరం మళ్లీ సర్దుబాట్ల అవసరం తలెత్తడం వల్ల పరిపాలనా భారం, ఫిర్యాదులు మరియు వివాదాలు పెరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రభుత్వం ముందుగా రాష్ట్ర పతి ఉత్తర్వులు--2025 ప్రకారం ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసి, తుది కేడర్ బలం మరియు వాస్తవ అవసరాల ఆధారంగా ఉపాధ్యాయుల పని సర్దుబాట్లు చేపట్టాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేస్తోందన్నారు.అయితే విద్యార్థుల విద్యా ప్రయోజనాల దృష్ట్యా తక్షణ సర్దుబాట్లు అనివార్యమని ప్రభుత్వం భావించిన పక్షంలో, వాటిని మండల స్థాయి లేదా అసెంబ్లీ నియోజకవర్గ స్థాయికే పరిమితం చేయాలని సంఘం సూచించింది. దీనివల్ల పాఠశాలల్లో తక్షణ అవసరాలు తీర్చబడటంతో పాటు, భవిష్యత్తులో అనవసర పునరావృత స్థానచలనాలు నివారించబడతాయని పేర్కొన్నారు.ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యార్థుల విద్యా ప్రయోజనాలు మరియు పరిపాలనా సమర్థత అనే మూడు అంశాలను సమన్వయం చేస్తూ ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# ఓటర్ల ఎన్యూమరేషన్ ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి-టి.సతీష్

● బి ఎల్ వొ లు, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశము నిర్వహించిన సతీష్





**మైలవరం,జూన్ 25 (వార్తాప్రభ) :** ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని 82- మైలవరం నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల శాఖ అధికారి టి.సతీష్ అన్నారు.82-మైలవరం నియోజకవర్గ పరిధిలో నిర్వహించబడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్ )-2026 కార్యక్రమములో భాగంగా స్థానిక తహశీల్దారు కార్యాలయంలో గురువారం బూత్ లెవెల్ అధికారులు (బీూా లు) మరియు సూపర్‌వైజర్ల తో సతీష్ తహశీల్దార్ అబ్దుల్ దరియ తో కలిసి సమీక్షా సమావేశము నిర్వహించారు.ఈ సమావేశంలో మైలవరం మండల పరిధిలో ఇంటింటికి ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారముల పంపిణీ కార్యక్రమము పురోగతి, సేకరించిన ఎన్యూమరేషన్ ఫారముల వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేయు ప్రక్రియ, అలాగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం అమలు తీరును ప్రగతి నివేదికల ఆధారంగా సమీక్షించారు. మండలంలో ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారముల పంపిణీ సుమారు 90 శాతం పూర్తయినట్లు గుర్తించి, మిగిలిన ఫారముల పంపిణీని తక్షణమే పూర్తి చేయుటతో పాటు, పంపిణీ చేసిన ఫారములను ఓటర్ల నుంచి సేకరించి, సంబంధిత వివరాలను నిర్దేశిత ఎన్నికల యాప్‌లో త్వరితగతిన నమోదు చేయాలని బూత్ లెవెల్ అధికారులకు సూచించారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయుటకు అవసరమైన చర్యలు చేపట్టవలసిందిగా సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు, ఎన్నికల సీనియర్ సహాయకులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఏళ్లు గడిచినా పే రివిజన్ ఊసే లేదు

● ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల లో పెరుగుతున్న అసంతృప్తి ప్రభుత్వం గ్రహించాలి - డెమొక్రటిక్ పిఆర్టియు ప్రభుత్వానికి విజ్ఞప్తి




**కైకలూరు,జూన్ 25 (వార్తాప్రభ) :** ఏళ్లు గడుస్తున్న పే రివిజన్ కమిషన్ ఊసే లేదని ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల్లో పెరుగుతున్న అసంతృప్తిని ప్రభుత్వం గ్రహించి తక్షణమే పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేసి మధ్యంతర భృతి ప్రకటించాలని డెమొక్రటిక్ పిఆర్టియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ డి శ్రీను, పి వెంకటేశ్వరరావు లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈరోజు కైకలూరులో నిర్వహించబడిన కైకలూరు నియోజకవర్గ ప్రాంతీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను మాట్లాడుతూ డిఏ మరియు గత పి ఆర్ సి బకాయిలు చెల్లింపులకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

**రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు..** 2003 కంటే ముందే నియమించబడిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేస్తూ మరియు వివిధ కార్పొరేషన్ ఉద్యోగులకు రిటైర్మెంట్ వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచిన నేపథ్యం దృష్ట్యా డెమొక్రటిక్ పి ఆర్ టి యు పక్షాన హర్షం వ్యక్తం చేశారు. సముచిత నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి విద్యా శాఖా మంత్రి లోకేష్ కి, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులందరికీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు. టి శ్రీనివాస్ ఎస్ శ్రీని వాస్. కైకలూరు కలిదిండి. మండవల్లి ముదినేపల్లి మండలాల నాయకులు జీవీఎస్ రామాంజనేయులు, సముద్రుడు, చంద్రశేఖర్, సుబ్రమణ్యం, జయరాం నాయుడు, హరిబాబు, ఫణి , రామారావు, మోహన్ కుమార్, రామోజీరావు, శివకుమార్,మేక రామారావు, బాలాజీ,కుమారస్వామి, ముప్వ నుండి సుబ్రహ్మణ్యం, ఉంగుటూరు నుండి కుమార్ రాజా, రామరాజు,సురేష్ తదితరులు పాల్గొన్నారు.


































Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188